# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 175 | విశాఖపట్నం | 27-3-2026 శుక్రవారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 175 | VISAKHAPATNAM | 27-3-2026 FRIDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram







2లో

అమరావతిపై అసెంబ్లీలో తీర్మానం అనేది చంద్రబాబు ఆడుతున్న డ్రామా: సజ్జల

## గుండె ఆరోగ్యంగా ఉండాలంటే ఏయే పరీక్షలను తరచూ చేయించుకోవాలి..?



6లో



2లో

పెట్రోల్ కోసం బంకులకు వాహనదారులు క్యూ

### అమరావతికి చట్టబద్ధత కల్పించేలా

# క్యాబినెట్ తీర్మానం



**అమరావతి, పతాకం న్యూస్:** ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం జరిగిన ఏపీ కేబినెట్ సమావేశంలో రాజధాని అమరావతికి సంబంధించి అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకున్నారు. అమరావతికి చట్టబద్ధమైన హోదా కల్పించేందుకు ఉద్దేశించిన తీర్మానానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీని కోసం ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014లోని సెక్షన్–5ను సవరించి, కొత్త రాజధానిగా 'అమరావతి' పేరును అధికారికంగా చేర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 28న జరగనున్న ప్రత్యేక శాసనసభ సమావేశంలో ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఆమోదం తెలుపనున్నారు. అనంతరం, పునర్విభజన చట్టంలో సవరణల కోసం ఈ ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వానికి పంపుతారు. ఈ చర్యతో అమరావతి రాజధానికి చట్టపరమైన భద్రత లభించనుంది. ఈ సమావేశంలో మరిన్ని కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేశారు. రాష్ట్రంలో కొత్తగా 96 జూనియర్, సీనియర్ సివిల్ జడ్జి కోర్టుల ఏర్పాటుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలాగే, నీరుకొండలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి 60 మీటర్ల ఎత్తు వరకు అకడమిక్ భవనాల నిర్మాణానికి అనుమతి మంజూరు చేశారు.

## ఘోర రోడ్డు ప్రమాదంలో

# 14 మంది సజీవ దహనం



**మార్కాపురం, పతాకం న్యూస్:** మార్కాపురం జిల్లాలో గురువారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రైవేట్ బస్సు–ఢీకొన్న ఈ ప్రమాదంలో 14 మంది సజీవదహనమవ్వగా, 15 మందికి గాయాలయ్యాయి. ప్రమాద జరిగిన సమయంలో బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నారని సమాచారం. క్షతగాత్రులను మార్కాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పలకల క్వారీల వద్ద టిప్పర్ – ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు దగ్ధమయ్యాయి. ప్రైవేటు ట్రావెల్స్ బస్సు తెలంగాణ రాష్ట్రంలోని జగిత్యాల నుంచి పామూరు వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తుంది. ప్రైవేటు బస్సు హరేకృష్ణ ట్రావెల్స్‌కు చెందినదిగా అధికారులు గుర్తించారు. మృతుల్లో మహిళలు, చిన్నారులు ఉన్నారు. వీరు కనిగిరి, పామూరు వాసులుగా గుర్తించారు. 3 అగ్నిమాపక వాహనాలతో ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకుని వచ్చారు. మంటలు చెలరేగిన వెంటనే బస్సు నుంచి 10 మంది ప్రయాణికులు హుటాహుటిన దిగిపోయారు. ప్రమాదం అనంతరం ఘటనాస్థలిని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పరిశీలించారు. ప్రమాదానికి సంబంధించిన కారణాలను ఎమ్మెల్యే అధికారులతో కలిసి ఆరా తీశారు. అదే విధంగా క్షతగాత్రులను తక్షణమే వైద్యసేవలకు తరలించేందుకు సహాయక చర్యలను అధికారులు ముమ్మరం చేశారు. ప్రమాదానికి బస్సు కండిషన్ సరిగా

లేకపోవడమే కారణమని ప్రయాణికులంటున్నారు. ఇదే విషయాన్ని బస్సు డ్రైవర్‌తో మాట్లాడినట్లు ప్రయాణికులు చెబుతున్నారు. అంతేకాకుండా యర్రగొండపాలెం వద్ద గంటసేపు బస్సును నిలిపివేసి సిబ్బంది మరమ్మతులు చేశారన్నారు. ఇదిలావుంటే ప్రమాద సమయంలో బస్సు స్టీరింగ్ స్ట్రక్ అయిందని డ్రైవర్ చెబుతున్నారు. దీనిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.తెలంగాణలోని జగిత్యాల నుంచి పామూరుకు బస్సు బయల్దేరింది. ఈ క్రమంలో చీమకుర్తి నుంచి కంకర్ లోడ్‌తో మార్కాపురం వైపు టిప్పర్ వస్తుండగా ఉదయం 6 గంటల సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ప్రస్తుతం మృతదేహాలను బస్సు నుంచి ఒక్కొక్కటిగా పోలీసులు బయటకు తీస్తున్నారు. ఇప్పటివరకు 13 మృతదేహాలను బస్సు నుంచి బయటకు పోలీసులు తీశారు. మార్కాపురం జిల్లా రాయవరం బస్సు ప్రమాదంపై కేబినెట్ భేటీలో చర్చ జరిగింది. మృతులకు కేబినెట్‌లో మంత్రులంతా సంతాపం తెలిపి, బాధిత కుటుంబాలకు సానుభూతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు చొప్పున, గాయపడినవారికి రూ.2 లక్షలు చొప్పున పరిహారం ఇవ్వాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

## వందేభారత్ రైలు భోజనంలో పురుగులు.. ఐఆర్‌సీటీసీకి రూ.10 లక్షలు జరిమానా



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడికి చేదు అనుభవం ఎదురైంది. అతడికి అందించిన భోజనంలో పురుగులు కనిపించాయి. దీంతో రైల్వే శాఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఐఆర్‌సీటీసీకి రూ.10 లక్షల జరిమానా విధించింది. పట్నా–టాటానగర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించిన రితేష్ కుమార్ అనే ప్రయాణికుడికి ఈ అనుభవం ఎదురైంది. రితేష్ కుమార్ పట్నా–టాటానగర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించారు. ఆ సమయంలో రితేష్‌కు అందించిన భోజనంలోని పెరుగులో పురుగులు కనిపించాయి. దీంతో షాకైన రితేష్ సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. రైల్వే సిబ్బంది కూడా ఆ భోజనాన్ని పరిశీలించారు.

### మార్కాపురం బస్సు ప్రమాద స్థలిని

## పరిశీలించిన అనిత



**మార్కాపురం, పతాకం న్యూస్:** మార్కాపురం సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి అనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే నారాయణరెడ్డి, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, జిల్లా అధికారులతో కలిసి ఆమె ప్రమాద స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ ప్రమాదంలో 13 మంది ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆమె ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే 'గోల్డెన్ అవర్'లో స్పందించి పలువురి ప్రాణాలు కాపాడిన అధికారుల చొరవను అభినందించారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న 28 మంది క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అవసరమైన వారిని మెరుగైన చికిత్స కోసం ఒంగోలుకు తరలించాలని సూచించామన్నారు. బాధితుల వైద్య ఖర్చులను పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని మంత్రి అనిత స్పష్టం చేశారు. మృతుల కుటుంబాలకు, గాయపడిన వారికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఈ ప్రమాదానికి గల కారణాలపై నిపుణుల కమిటీతో సమగ్ర విచారణ జరిపిస్తామన్నారు.

### ఏపీ బస్సు ప్రమాదంపై

## ప్రధాని దిగ్భ్రాంతి..

### మృతులకు రూ.2 లక్షల చొప్పున పరిహారం



**న్యూఢిల్లీ పతాకం న్యూస్:** ఏపీలోని మార్కాపురం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ విషాద ఘటనపై ప్రధాని నరేంద్ర మోడీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రధాని పరిహారం ప్రకటించారు. "ఏపీలోని మార్కాపురం జిల్లాలో జరిగిన ప్రమాదం చాలా విషాదకరం. ఆప్తులను కోల్పోయిన కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలి" అని ఆయన అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి రూ. 2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని పీఎంఓ 'ఎక్స్'లో వెల్లడించింది.




పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## గండం!

మానవాళి మనుగడకు నీరే ప్రాణాధారం. జల భద్రతతోనే భవిత సురక్షితం. నీరు లేకుండా జీవం లేదు. నీటి లభ్యత వున్న నదీ పరివాహక ప్రాంతాలు, తీరప్రాంతాల్లోనే ప్రాచీన నాగరికతలు, ఆధునిక సమాజాలు అభివృద్ధి చెందాయి. ఇది మానవ ఆవాసాల స్థిరత్వానికి మూలాధారం. 'నీటి పేరు వింటేనే నిలువునా తడిసిపోతాం/ నీరంటేనే జలజలలాడి పోతాం/ నీటితనంతో ప్రాణులం/ నిత్యజీవన తేజో విరాజితులమౌతాం' అంటారు డాక్టర్ ఎన్.గోపి 'జలగీతం' దీర్ఘకవితలో. నీరు వున్నా...శుద్ధంగా లేకపోతే జీవితం లేదు. అత్యంత విలువైన ప్రకృతి వనరులలో నీరు ఒకటి. అత్యంత అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా వాడే వనరులలో ప్రధానమైనదీ నీరే. 'జలమే జీవం' అని పెద్దలు చెప్పిన మాట... ఇప్పుడో హెచ్చరిక. జనాభా పెరుగుదల కారణంగా నీటి లభ్యత లేని ప్రాంతాల్లో సమాజం తీవ్రమైన నీటి ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ఇది సామాజిక, ఆర్థిక అభివృద్ధిని ప్రభావితం చేస్తున్నది. ప్రపంచంలో నయా ఉదారవాద ఆర్థిక విధానాలు పురుడు పోసుకున్నాక నీటి ఆవశ్యకతపై చర్చ మొదలైంది. భవిష్యత్తరాలకు సురక్షిత నీటిని అందించాలన్న లక్ష్యం మొలకెత్తింది. నీటిని సంరక్షించుకోకపోతే, భవిష్యత్ అంధకారమౌతుందని, జీవకోటి మనుగడ ప్రశ్నార్థక మౌతుందని భయాందోళనలు అలముకున్నాయి. భవిష్యత్‌లో ఎదురయ్యే నీటి సంక్షోభాలను అధిగమించేందుకు, ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ప్రతి యేటా 'ప్రపంచ జల దినోత్సవం' నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 'నీరు-జెండర్' అనే థీమ్‌ను ఐరాస రూపొందించింది. 'నీరు ప్రవహించే చోట, సమానత్వం పెరుగుతుంది' అనే నినాదంతో నీటి చైతన్యం పెంపొందించే ప్రయత్నం చేస్తోంది. ఈ సందర్భంగా... సమస్యకు మూల మెక్కడీ కారకులెవరు? లబ్ధి పొందుతున్నదెవరు? బాధితులెవరు? అన్న సత్యాన్ని విస్మరించకూడదు. ఐరాస అంచనా ప్రకారం... నేటికీ ప్రపంచ వ్యాప్తంగా 200 కోట్ల మందికి పైగా ప్రజలకు రక్షిత తాగునీరు అందుబాటులో లేదు. ఈ సంఖ్య వెనుక అత్యంత బాధితులుగా వుండేది మహిళలే. ఐరాస, డబ్లుహెచ్‌ఓ, యునెస్కో, యూఎన్ ఉమెన్, భారత జలశక్తి మంత్రిత్వ శాఖ గణాంకాల సహితంగా నమోదైన వాస్తవం ఇది. ప్రపంచవ్యాప్తంగా మహిళలు, బాలికలు ప్రతిరోజూ నీటి సేకరణకు 25 కోట్ల గంటలు వెచ్చిస్తున్నారు. ఇది పురుషులు, బాలుర కంటే మూడురెట్లు ఎక్కువ. ప్రతిరోజూ 20కోట్ల మంది భారతీయులు సుదూరాలు నడిచివెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. వీరిలో అత్యధికులు మహిళలు, బాలికలే. ఐదేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా రక్షిత మంచినీరు అందిస్తామని 2019లో ఆర్భాటంగా 'జల్ జీవన్ మిషన్' పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకం 2024 నాటికి పూర్తికావాల్సి వుండగా, చాలా రాష్ట్రాల్లో అసలు అమలుకే నోచుకోలేదు. దీంతో ఈ పథకం కాలపరిమితిని 2028 వరకూ పొడిగించడంతో పాటు, కేటాయింపులను కూడా రూ.8.69 లక్షల కోట్లకు పెంచుతూ ఇటీవల ప్రధాని మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే వేసవి మొదలు కావడంతో దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో తాగునీటి కొరత తీవ్రమైంది. 2030 నాటికి దేశంలోని 21 ప్రధాన నగరాల్లో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటే ప్రమాదం వుందని గణాంకాలు చెబుతున్నాయి. పర్యావరణ విధ్వంసం కూడా దీనికి ప్రధాన కారణం. జల నాణ్యత సూచీలో 122 దేశాలలో భారత్ 120వ స్థానంలో వుంది. మనం భూగర్భ జలాలను, నీటి వనరులను కోల్పోవడమే కాదు, ఉన్న నీటిని కూడా విషపూరితం చేస్తున్నామని అనేక నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. స్వచ్ఛమైన నీరు అందించడం ప్రభుత్వాల బాధ్యత. ప్రజల ప్రాథమిక హక్కులను కూడా కాపాడలేని పరిస్థితిలో ప్రభుత్వాలున్నాయి. దేశంలో ఏటా 3.77 కోట్ల మంది కలుషిత నీటి వల్ల వ్యాధుల బారిన పడుతున్నారు. డయేరియా వంటి వ్యాధులతో ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ ఏడాది మొదట్లోనే ఇండోర్‌లో కలుషిత నీటితో 15 మంది మరణించిన సంగతి తెలిసిందే. లక్ష్యాలు గొప్ప వుంటే సరిపోదు, వాటి అమలు కూడా అంతే గొప్పగా వుండాలి. కాగితాలపై కనిపించే ప్రణాళికలు ఆచరణలో అమలుకు నోచుకోవాలి. పారదర్శకత లేని వ్యవస్థలో ప్రజా ప్రయోజనం కనిపించదనేది నిజమని ఎప్పటికప్పుడు రుజువౌతూనే వుంది. 'చిన్న ఝరం గిరులు దూకి జీవనదిగ మారినట్లు/ ...చుక్క ఎదిగి ఎదిగి పూర్ణ సుధాంశునిగ మారినట్లు/ ...సరసి మహాతపమొనర్చి సంద్రంగా మారినట్లు' అంటారు సినారె. ఇదేవిధంగా, జల్ జీవన్ మిషన్ సహా ప్రభుత్వ నీటి పథకాలన్నిటినీ చిత్తశుద్ధితో అమలు చేస్తే, బొట్టు బొట్టు భద్రం చేస్తే.. ప్రజలు నీటి గండం నుంచి గట్టెక్కుతారు.

## పెట్రోల్ కోసం బంకులకు వాహనదారులు క్యూ



**హైదరాబాద్, అమరావతి, పతాకం న్యూస్:** పెట్రోలు బంక్‌లు మూతపడతాయనే పుకార్లతో వాహనదారులు పెట్రోలు బంక్‌లకు క్యూ కడుతున్నారు. వందల మంది వాహనదారులు అవసరం లేకపోయినా ట్యాంకులు ఫుల్ చేయించుకుంటున్నారు. అంతటితో ఆగకుండా బాటిళ్లు, క్యాన్లు తెచ్చుకుని మరీ నింపుకుపోతున్నారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి మొదలైన ఈ తాకిడికి పెట్రోల్ బంక్‌ల్లో స్టాక్ అయిపోయింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇరాన్ – అమెరికా యుద్ధ ప్రభావం భారత్ దేశంపై అంతగా లేకపోయినా, సోషల్ మీడియాలో వచ్చే పుకార్ల కారణంగా ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలోని పలు పట్టణాల్లో పెట్రోల్ బంకులు వాహనదారులతో కిటకిటలాడుతున్నాయి. గత రెండు రోజులుగా పెట్రోల్, డీజిల్ విక్రయాలు విపరీతంగా పెరిగాయి. పెట్రోల్ కొరత ఏర్పడుతుందనే భయంతో ప్రజలు అవసరానికి మించి నిల్వ ఉంచుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో బంకుల వద్ద కృత్రిమ కొరత వచ్చే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లోని పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు బారులు తీరారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ దొరకట్లేదనే ప్రచారంతో పెద్దఎత్తున క్యూ కడుతున్నారు. దీంతో రాష్ట్రంలో బంకులు రద్దీగా మారాయి. పెట్రోల్, డీజిల్ దొరకదనే భయంతో ముందుగానే ట్యాంకులు ఫుల్ చేయించుకుంటున్నారు. ఇలా చేయడం వల్ల కొన్నిచోట్ల నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. ఒక పెట్రోల్ బంక్ రోజుకు ఒక ట్యాంకర్ పెట్రోల్, రెండు ట్యాంక్‌ల డీజిల్‌ను విక్రయిస్తూ ఉంటారు. కానీ గత రెండు రోజులుగా వీటి సంఖ్య పెరిగింది. ఇరాన్ – అమెరికా యుద్ధం నేపథ్యంలో భారత దేశంలో పెట్రోల్ కొరత పెరిగిపోయిందని సామాజిక మాధ్యమాల్లో అవాస్తవ ప్రచారాలు చేస్తున్నారు. ఇవి చూసిన నెటిజన్లు నిజనిజాలు నిర్ధారించుకోకుండా వాటిని ఇతరులకు షేర్ చేస్తున్నారు. దీంతో యుద్ధ ప్రభావం కారణంగానే ఇలా కొరత ఉందనే భ్రమతో పెట్రోల్ బంకుల వద్ద వాహనాదారులు క్యూలు కడుతున్నారు. అయితే కొందరు ముందు ముందు పరిస్థితులు మరింత క్షీణించే అవకాశం ఉంటుందేమోనని భావించి బాటిళ్లు, క్యానులు, టిన్‌లలో పెట్రోల్, డీజిల్‌ను విక్రయించి నిల్వ ఉంచుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

## బాధ్యులైన వారిపై కఠిన చర్యలు: రాంప్రసాద్ రెడ్డి



**మార్కాపురం, పతాకం న్యూస్:** ప్రకాశం జిల్లా మార్కాపురంలో జరిగిన బస్సు ప్రమాద ఘటన బాధాకరమని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. గురువారం ఉదయం బస్సు ప్రమాద ఘటనా స్థలాన్ని మంత్రి పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ ప్రమాదానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రమాదంలో 13 మంది మరణించారని... మృతుల కుటుంబాలను ఆదుకుంటామని అన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తామని మంత్రి వెల్లడించారు. కర్నూలు ఘటన జరిగిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామని.. ట్రావెల్స్ బస్సుల తనిఖీలు నిర్వహిస్తున్నామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. మార్కాపురంలో జరిగిన బస్సు ప్రమాదంపై మంత్రి వాసంశెట్టి సుభాష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఘటనాస్థలిలో బాధితులకు అన్ని రకాల సహాయ చర్యలు అందించాలన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు సమాచారం అందేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచనలు చేశారు.

## ఏపీ క్యాబినెట్ నిర్ణయాలను వెల్లడిం




## చిన పార్థసారథి

**అమరావతి, పతాకం న్యూస్:** ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, పరిపాలన సంస్కరణలే లక్ష్యంగా సుదీర్ఘంగా చర్చించి అనేక అంశాలను ఆమోదించారు. అమరావతిని శాశ్వత రాజధానిగా సుస్థిరం చేసేలా అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టడం, న్యాయవ్యవస్థను బలోపేతం చేస్తూ 96 కొత్త కోర్టులు, 1730 ఉద్యోగాలను సృష్టించడం, వడ్డెర సామాజిక వర్గానికి క్వారీల్లో రిజర్వేషన్లు, ఆస్తిపన్ను వడ్డీ మాఫీ వంటి సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశం అనంతరం మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరాలు వెల్లడించారు. అమరావతి రాజధాని విషయంలో భవిష్యత్తులో ఎలాంటి మార్పులకు ఆస్కారం లేకుండా పటిష్టమైన చర్యలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం–2014లోని సెక్షన్ 5ను సవరించాలని కేంద్రాన్ని కోరుతూ రాష్ట్ర అసెంబ్లీలో ప్రత్యేక తీర్మానం చేయడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ సవరణ ద్వారా సెక్షన్ 5(2)లో "ఎట్ అమరావతి" అనే పదాన్ని, అలాగే అమరావతి అంటే ఏపీసీఆర్‌డీఏ చట్టం కింద నోటిఫై చేసిన ప్రాంతం అని స్పష్టంగా చేర్చాలని ప్రతిపాదించారు. గత ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో సృష్టించిన గందరగోళం పునరావృతం కాకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. రాజకీయ కక్ష సాధింపులతో రాజధానిని మార్చే దుశ్చర్యలకు పాల్పడకుండా, అమరావతిని శాశ్వత రాజధానిగా, ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పార్థసారథి వివరించారు. రాష్ట్రంలో పేరుకుపోయిన కేసుల భారాన్ని తగ్గించి, ప్రజలకు సత్వర న్యాయం అందించే లక్ష్యంతో న్యాయవ్యవస్థను బలోపేతం చేసేందుకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. హైకోర్టు ప్రతిపాదన మేరకు రాష్ట్రవ్యాప్తంగా 96 కొత్త కోర్టులను (అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జ్, సివిల్ జడ్జ్ కోర్టులు) ఏర్పాటు

### రాజధాని అమరావతి చట్టబద్ధత కోసం

## 28న అసెంబ్లీ ప్రత్యేక సమావేశం: అయ్యన్న



**అమరావతి, పతాకం న్యూస్:** అమరావతి రాజధాని విషయంలో ఐదేళ్లుగా సాగుతున్న అస్పష్టతకు, రాజకీయ వివాదాలకు శాశ్వతంగా ముగింపు పలికే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఏపీ రాజధాని అమరావతి మాత్రమే అని అసెంబ్లీలో తీర్మానం చేయడమే కాకుండా, దీనికి కేంద్ర చట్టబద్ధత కల్పించేలా అసెంబ్లీలో తీర్మానం చేసేందుకు మార్చి 28న ఉదయం 11 గంటలకు శాసనసభ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడించారు. ఏపీ సచివాలయంలో స్పీకర్ మాట్లాడుతూ... రాజధాని విషయంలో ఇప్పటివరకు ఉన్న 'లీగల్ గ్యాప్'ను భర్తీ చేయడమే ఈ స్పెషల్ సెషన్ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. అమరావతి ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధాని అని సభలో ఏకగ్రీవ తీర్మానం చేసి, ఆ వెంటనే దాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. ప్రస్తుతం ఢిల్లీలో పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఏప్రిల్ 4 వరకు జరగనున్న నేపథ్యంలో, ఏపీ అసెంబ్లీ పంపే ఈ తీర్మానాన్ని వెంటనే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టం చేయిస్తామని వెల్లడించారు. ఈ ప్రక్రియ గనుక పూర్తయితే, ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి పూర్తిస్థాయి చట్టబద్ధత లభిస్తుంది. దీనివల్ల భవిష్యత్తులో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా రాజధానిని మార్చడం లేదా మూడు రాజధానుల పేరుతో గందరగోళం సృష్టించడం సాధ్యం కాదు. గవర్నర్ అబ్దుల్ నజీర్ ఉత్తర్వుల మేరకు వెలగపూడి అసెంబ్లీ హాల్‌లో ప్రత్యేక సమావేశం జరుగుతుందని స్పీకర్ తెలిపారు.

## అమరావతిపై అసెంబ్లీలో తీర్మానం అనేది చంద్రబాబు ఆడుతున్న డ్రామా: సజ్జల




**అమరావతి, పతాకం న్యూస్:** ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించేందుకు కూటమి ప్రభుత్వం అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తుండటాన్ని వైసీపీ తీవ్రంగా తప్పుబట్టింది. ఈ పరిణామాలపై ఆ పార్టీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శలు గుప్పించారు. అసెంబ్లీలో తీర్మానం చేయడం అనేది కేవలం ప్రజలను మభ్యపెట్టడానికి చంద్రబాబు ఆడుతున్న 'డ్రామా' అని ఆయన అభివర్ణించారు. కేవలం అసెంబ్లీని మాత్రమే ఎందుకు సమావేశపరుస్తున్నారని, మండలిని ఎందుకు పిలవలేదని ఆయన ప్రశ్నించారు. రాజధానిని ఒక 'శాశ్వత కామధేనువు'గా మార్చుకుని చంద్రబాబు అక్కడ అవినీతి యజ్ఞం చేస్తున్నారని ధ్వజమెత్తారు. గతంలో టెండర్లు ఖరారైన పనులకు మళ్లీ కొత్తగా టెండర్లు పిలవడం, డిజైన్ల పేరుతో రూ. 400 కోట్లు ఖర్చు చేయడం వెనుక పెద్ద గూడుపుఠాణి ఉందని ఆరోపించారు. జగన్ గారు ఎప్పుడూ అమరావతికి వ్యతిరేకం కాదని, అందుకే అధికారంలోకి రాకముందే అక్కడ ఇల్లు కట్టుకున్నారని గుర్తు చేశారు. తాము ప్రశ్నిస్తోంది కేవలం అక్కడ జరుగుతున్న దోపిడీ, పారదర్శకత లేని పనుల గురించేనని అన్నారు. రాజధాని కనెక్టివిటీ కోసం వెస్ట్ బైపాస్ వంటి పనులను వైసీపీ హయాంలోనే పూర్తి చేశామని, కానీ ఇప్పుడు చంద్రబాబు కేవలం అప్పులు తెచ్చి మొబిలైజేషన్ అడ్వాన్స్‌ల రూపంలో కమీషన్లు కొట్టేస్తున్నారని ఆరోపించారు. రైతులకు ఇచ్చిన ప్లాట్లను అభివృద్ధి చేయకుండా, కేవలం తన సొంత ఇంటి నిర్మాణాన్ని మాత్రమే జోరుగా సాగిస్తున్నారని ఎద్దేవా చేశారు. అమరావతి పేరుతో రాష్ట్ర భవిష్యత్తును చీకట్లోకి నెడుతున్నారని, ప్రజల సొమ్మును పీల్చి పిప్పి చేస్తున్నారని సజ్జల రామకృష్ణారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.

## పొట్టి శ్రీరాములు విగ్రహం నిర్వహణ బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలి: సిపిఐ



**తుళ్లూరు, పతాకం న్యూస్:** రాజధాని అమరావతిలో పొట్టి శ్రీరాములు విగ్రహం నిర్మాణ భాధ్యతను ప్రభుత్వం చేపట్టాలని సిపిఐ జాతీయ కంట్రోల్ కమీషన్ ఛైర్మన్ కె నారాయణ అన్నారు. రాజధానిలోని తుళ్లూరు– పెదపరిమి మధ్య నెక్కల్లు రోడ్డులో నిర్మించిన పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని నారాయణ గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర సాధన కోసం పోరాడి అశువులు బాసిన పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులన్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం 58 రోజులు దీక్ష చేసిన వ్యక్తి అని కొనియాడారు. రాజధాని ప్రాంతంలో విగ్రహం ఏర్పాటు చేయడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. విగ్రహ నిర్వహణ బాధ్యత ప్రభుత్వం తీసుకుంటే బాగుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, పొట్టి శ్రీరాములు మోమోరియల్ ట్రస్ట్ ఛైర్మన్ దూండి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# త్వరితగతిన అటవీ అనుమతులు మంజూరు చేయాలి



**పాడేరు, పతాకం న్యూస్:** రోడ్ల నిర్మాణాలకు సంబంధించిన అటవీ, పర్యావరణ అనుమతులను త్వరితగతిన మంజూరు చేసేందుకు అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. రహదారుల నిర్మాణాలు, అటవీ ఆంక్షలు, అనుమతులపై అల్లూరి, పోలవరం జిల్లాలకు చెందిన అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. రోడ్లకు సంబంధించిన అటవీ అనుమతుల ప్రక్రియలను ఆయా శాఖల అధికారులు సమన్వయంతో సర్వేలు, పరిశీలనలు చేయాలన్నారు. ఆయా దశల్లో జరిపే ప్రక్రియలను సైతం సకాలంలో పూర్తి చేయాలన్నారు. వీలైనంత తొందరగా రోడ్ల నిర్మాణానికి అటవీ అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ సూచించారు. అటవీ అనుమతులు మంజూరైన వెంటనే రోడ్ల నిర్మాణ పనులు చేపట్టేలా ఇంజనీరింగ్ అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తేనే రోడ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తవుతాయన్నారు. మారుమూల ప్రాంతాలకు రోడ్లు, మౌలిక సదుపాయాలు కల్పిస్తేనే అభివృద్ధి చెందుతాయన్నారు. చింతపల్లి మండలం కిటుములు నుంచి చెరువులవేనం వరకు, అనంతగిరి మండలంలో రేవెళ్ల నుంచి గుమ్మకోట వరకు, జీకేవీధి మండలం గాలికొండ నుంచి పెదలంక వరకు నిర్మించే రోడ్లకు సంబంధించిన అటవీ భూములకు ప్రత్యామ్నాయంగా రెవెన్యూ భూములను కేటాయించాలన్నారు. అలాగే సెల్ టవర్ల నిర్మాణాలకు భూములు కేటాయింపులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి జేసీ, ఐటీడీఏ పీవో టి.శ్రీపూజ, జిల్లా రెవెన్యూ అధికారి సూకరాజు, పాడేరు ఇన్‌చార్జి డీఎఫ్‌వో మహేశ్వరి, చింతపల్లి డీఎఫ్‌వో నర్సింగరావు, అటవీ, రెవెన్యూ, ఇంజనీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కేజీహెచ్‌లో నూతన డయాలసిస్ యూనిట్ ప్రారంభం



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్ర మెడికల్ కాలేజీ, కింగ్ జార్జ్ హాస్పిటల్, విశాఖపట్నం జనరల్ మెడిసిన్ విభాగం, ఆకస్మిక, దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు నూతన డయాలిసిస్ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి మాట్లాడుతూ, ఈ డయాలిసిస్ యూనిట్ ఆధునిక యంత్రాలు సదుపాయాలతో అమర్చబడి, సమర్ధవంతమైన, సురక్షితమైన హీమోడయాలిసిస్ చికిత్సలను అందిస్తాయని తెలిపారు. దీని ద్వారా ప్రస్తుతం ఉన్న సదుపాయాలపై భారం తగ్గి, రోగుల చికిత్స ఫలితాలు మెరుగుపడతాయని చెప్పారు. నిరంతరం డయాలిసిస్ అవసరమయ్యే రోగులకు, ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు, చికిత్స అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో కెజిహెచ్ నెఫ్రాలజీ విభాగ అధిపతి డాక్టర్ జి.ప్రసాద్, మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ డి. రాధాకృష్ణన్ పాల్గొన్నారు.

## మే 1నుంచి 31వ తేదీ వరకు వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు

**అనకాపల్లి, పతాకం న్యూస్:** జిల్లాలోని 50 కేంద్రాల్లో మే ఒకటి నుంచి 31వ తేదీ వరకు వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను నిర్వహించనున్నట్టు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి (డీఎస్ఏఓ) పూజారి శైలజ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఎనిమిది నుంచి 14 ఏళ్ల లోపు వయసున్న పిల్లలు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకొని ఆయా క్రీడల్లో తర్ఫీదు పొందడంతోపాటు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి ఈ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇదే సమయంలో క్రీడాల్లో ప్రతిభావంతులను గుర్తించి, వారిని మరింత ప్రోత్సహించడానికి వీలుంటుందని పేర్కొన్నారు.



కాగా ఆయా క్రీడా శిక్షణ కేంద్రాల నిర్వహణకు ఆసక్తిగల క్రీడా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్, ఫిజికల్ డైరెక్టర్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు, కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు ఈ నెల 30వ తేదీలోపు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. మరిన్ని వివరాల కోసం 98855 30819, 9332777778 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

## ఎలమంచిలిలో భారీ చోరీ



**ఎలమంచిలి, పతాకం న్యూస్:** పట్టణంలోని కొత్తపాలెం ప్రాంతంలో పట్టపగలు ఓ ఇంటిలో భారీ చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులో ఇంటిలోకి ప్రవేశించి బీరువాలో వున్న తొమ్మిది తులాల బంగారు ఆభరణాలో అపహరించుకుపోయారు. ఈ సంఘటపై అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. కొత్తపాలెం చెరకు కొనుగోలు కేంద్రం సమీపంలో పంట పొలాల వద్ద నిర్మించుకున్న ఇంటిలో బొడ్డేటి సంతోశ్, భార్య, ఇద్దరు కుమార్తెలతో నివాసం వుంటున్నారు. మధ్యాహ్నం సంతోశ్ ఇంటికి సమీపంలో వున్న పొలంలో పనులు చేసుకుంటున్నారు. ఎలమంచిలిలో కుమార్తెలు చదువుతున్న పాఠశాల వార్షికోత్సవం కావడంతో భార్య అక్కడకు వెళ్లింది. ఎప్పటి మాదిరిగానే ఇంటికి తాళం వేసి, తాళం చెవిని బయట రహస్య ప్రదేశంలో పెట్టారు. ఆమె సాయంత్రం తిరిగి వచ్చి, తాళం తీసి ఇంటిలోకి వెళ్లింది. ఆభరణాలను భద్రపరిచిన పెట్టె మంచంపై వుండడంతో అనుమానం వచ్చి బీరువా తెరిచి చూసింది. ఇందులో భద్రపరిచిన తొమ్మిది తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో ఆందోళన చెందిన ఆమె.. సమీపంలోని పొలంలో వున్న భర్త వద్దకు వెళ్లి చోరీ జరిగిన విషయం చెప్పింది. సంతోశ్ ఇంటికి వచ్చి మరోసారి బీరువాలో పరిశీలించారు. బంగారం వస్తువులు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్టు నిర్ధారించుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ ధనుంజయరావు, ఎస్ఐ సావిత్రి, సిబ్బందితో వచ్చి పరిశీలించారు. క్లూస్ టీమ్ వచ్చి పలుచోట్ల వేలిముద్రలు సేకరించింది. మంగళవారం తమ కుమార్తె పుట్టిన రోజును బంధువులతో కలిసి జరుపుకున్నామని, మరుసటి రోజే బంగారం చోరీకి గురైందని భార్యాభర్తలు వాపోయారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి, పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.

## గ్యాస్ కొరతతో హోటళ్లు మూత




**అచ్యుతాపురం, పతాకం న్యూస్:** వాణిజ్య వంటగ్యాస్ సిలిండర్ల సరఫరాను కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంధన కంపెనీలు బాగా తగ్గించడంతో ఆ ప్రభావం అన్ని రకాల హోటళ్లపై తీవ్రంగా పడింది. గ్యాస్ సిలిండర్లు డెలివరీ కాకపోవడంతో పలువురు టిఫిన్ సెంటర్లు, హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను తాత్కాలికంగా మూసివేశారు. మరికొందరు కట్టెలతో వంటలు చేస్తూ, కొన్నిరకాల ఆహార పదార్థాలను వండడం ఆపేశారు. వాణిజ్య వంటగ్యాస్ సరఫరా కాకపోవడంతో తమ వ్యాపారాలు బాగా దెబ్బతిన్నాయని, ఆదాయం పడిపోయిందని పలువురు వ్యాపారులు వాపోతున్నారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురంలో వందకుపైగా చిన్నాచితక హోటళ్లు ఉన్నాయి. వాణిజ్య వంటగ్యాస్ సిలిండర్లు సరఫరా కాకపోవడంతో 80 శాతానికిపైగా హోటళ్లను మూసేశారు. మిగిలిన హోటళ్ల నిర్వాహకులు కట్టెపొయ్యిలపై వంటలు చేస్తున్నారు. చెట్ల కలపతోపాటు కోత మిల్లుల్లో వ్యర్థాలుగా వచ్చే చెక్క ముక్కలను (రద్దు) కొనుగోలు చేస్తున్నారు. గ్యాస్‌తోపోలిస్తే కట్టెలపై వంట చేయడం వల్ల ఖర్చులు పెరిగాయంటూ హోటళ్ల నిర్వాహకులు ఆహార పదార్థాల ధరలు పెంచారు. చిన్నపాటి హోటళ్లలో గతంలో రూ.20కి నాలుగు ఇడ్లీ ఇచ్చేరు. ప్రస్తుతం వీటిని మూడుకు తగ్గించేశారు. రెండు కోడిగుడ్లతో కూరను రూ.35కి ఇచ్చేవారు. దీని ధర రూ.45కి పెంచారు. ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్)లోని కర్మాగారాల్లో పనిచేసే కార్మికులతోపాటు ఉద్యోగులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రికి భోజనాలు సరఫరా కాంట్రాక్టు తీసుకున్న హోటళ్ల వారి పరిస్థితి మరింత దయనీయంగా మారింది. గ్యాస్ సరఫరా లేకపోయినప్పటికీ ఒప్పందం ప్రకారం ఆయా కంపెనీలకు ఆహార పదార్థాలను వండి, సరఫరా చేయాల్సిందే. దీంతో కట్టెల పొయ్యిలను ఏర్పాటు చేసుకొని ఆపసోపాలు పడుతూ వంటలు చేస్తున్నారు. గ్యాస్ పొయ్యిలపై వండినంత వేగంగా కట్టెలపొయ్యిలపై వంటలు చేయలేకపోతున్నారు. అంతేకాక చాలా మంది కుక్‌లకు కట్టెల పొయ్యిలపై వంట చేయడంలో అంతగా అనుభవం లేదు.

## అరకు రిసార్ట్స్ వద్ద యువకుడి దారుణ హత్య



**అరకులోయ, పతాకం న్యూస్:** అరకులోయలోని 'రూపా' రిసార్టు వద్ద ఒక యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. అరకులోయ నుంచి లోతేరు వెళ్లే రహదారిలో హట్టగుడ గ్రామ సమీపాన ఉన్న ఈ రిసార్టు వద్ద ఈ సంఘటన చోటుచేసుకుంది. దీనికి సంబంధించి మృతుడి బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం జిల్లా తెర్లాం మండలం జన్నివలస గ్రామానికి చెందిన నాగెళ్ల సురేశ్ (25) హైదరాబాద్‌లోని ఒక జ్యువెలరీ షాపులో పనిచేస్తున్నాడు. అతనికి వివాహం కాగా, అతని భార్య ప్రస్తుతం గర్భవతి. సురేశ్ గతంలో పద్మాపురంలోని ఒక రిసార్టులో కొన్నాళ్లు పనిచేశాడు. ఆ సమయంలో అతనికి అదే రిసార్టులో పనిచేస్తున్న మహిళతో సన్నిహిత సంబంధం ఏర్పడింది. ఇక్కడ పనిచేస్తూ హైదరాబాద్ వెళ్లాడు. ఇటీవల స్వగ్రామమైన జన్నివలసలో ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమానికి వచ్చాడు. విజయనగరం వెళుతున్నట్టు ఇంట్లో చెప్పి అరకులోయ చేరుకుని, గతంలో పరిచయం ఉన్న మహిళతో కలిసి ఉదయం 10 గంటలకు రూపా రిసార్టులో రూమ్ తీసుకున్నాడు. వారిద్దరూ గదిలో ఉండగా రూపా రిసార్టులో పని చేస్తున్న ముగ్గురు యువకులు ఇబ్బంది పెట్టారు. సురేశ్‌తో వాళ్లు గొడవకు దిగారు. దీంతో రూమ్ ఖాళీ చేసి రాత్రి పది గంటలకు మహిళతో పాటు సురేశ్ బయటకు రాగా, ఆ యువకులు వెంటపడ్డారు. వారి మధ్య కొంతసేపు ఘర్షణ జరిగింది. ఆ యువకులు కత్తితో సురేశ్‌ను పొడిచి హెల్మెట్‌తో తలపై తీవ్రంగా కొట్టారు. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. సురేశ్‌తో ఉన్న మహిళ భయాందోళనకు గురై అక్కడి నుంచి పారిపోయింది. సమాచారం అందడంతో సురేశ్ బంధువులు బుధవారం సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఉదయం స్థానిక ఎస్ఐ గోపాలరావుతో కలిసి పాడేరు డీఎస్పీ అభిషేక్ సంఘటన స్థలానికి చేరుకుని సురేశ్ మృతదేహాన్ని పరిశీలించారు. రిసార్టు యజమానిని, సిబ్బందిని విచారణ జరిపారు. నిందితుల కోసం గాలిస్తున్నారు.

## 33 పంచాయతీల్లో శతశాతం పన్ను వసూలు

**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జిల్లాలోని 33 గ్రామ పంచాయతీలు శతశాతం పన్నులు వసూలు చేశాయి. జిల్లాలో 79 పంచాయతీలు ఉన్నాయి. మొత్తం కలిపి 89.11 శాతం పన్నులు వసూలు చేయడంతో రాష్ట్రంలో జిల్లా రెండో స్థానంలో నిలిచింది. ఆనందపురం మండలం భీమన్నదొరపాలెం, కోలవానిపాలెం, బంటుపల్లివారి కల్లాలు, శిర్లపాలెం, బోని, పేకేరు, మామిడిపాలెం, భీమిలి మండలం అవనాం, నగరపాలెం, బోడమెట్టపాలెం, మజ్జిపేట, లక్ష్మీపురం, నారాయణరాజుపేట, మూలకుద్దు, పద్మనాభం మండలం పెంట, శేరిఖండం, బాందేవపురం, చెన్నాపురం, వెంకటాపురం, తునివలస, పద్మనాభం, కొవ్వాడ, బుడ్డివలస, బీఆర్ తాళ్లవలస, విలసన్న పాలెం, కృష్ణాపురం, ఐనాడ, పెందుర్తి మండలం జెర్రిపోతులపాలెం, గవరపాలెం, పెద గాడి, ముదపాక, గొరపల్లి, చింతగట్ల పంచాయతీల్లో శతశాతం పన్నులు వసూలయ్యాయి.

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులంతా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చితో కలిసి సాయంత్రం కలెక్టరేట్ హాలులో ఆయన వివిధ అంశాలపై సమీక్షించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ముందుగా డిప్యూటీ ట్రాన్స్ పోర్టు కమిషనర్ ఆర్‌సిహెచ్.శ్రీనివాసరావు నివేదికలను ప్రదర్శించారు. గతం కంటే ఇప్పుడు రోడ్డు ప్రమాదాలు తగ్గాయన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రథమంగా జిల్లాలో ఏర్పాటుచేసిన వేగ నియంత్రికల (స్పీడ్ బ్రేకర్స్)పై జివిఎంసి, ఆర్‌టిసి, పోలీసు, రోడ్డు ట్రాన్స్ పోర్టు అధికారులు సంయుక్త పున్హపరిశీలన చేయాలని ఆదేశించారు. వాటి అవసరం ఎంత మేరకు ఉంది, ప్రయోజనాలు, దుష్ప్రయోజనాలను బేరీజు వేయాలని సూచించారు. అవసరం లేని చోట తొలగించాలని చెప్పారు. ర్యాష్ డ్రైవింగ్ చేసే వాళ్లపై కఠినంగా ఉండాలన్నారు. జాతీయ రహదారిలో పాదచారుల క్రాసింగ్ వద్ద విధిగా సూచిక బోర్డులు, వాహనాదారులకు కనిపించేలా బ్లింకర్స్ పెట్టాలని ఎన్‌హెచ్ఎఐ అధికారులను ఆదేశించారు. హనుమంతువాక జంక్షన్ విస్తరణ, అండర్ పాస్ నిర్మాణంపై చర్చించిన ఆయన జూ పార్కు నుంచి వచ్చే రోడ్డులో హనుమంతువాక సిగల్ వద్ద ఫ్రీ లెఫ్ట్, కైలాసగిరి నుంచి ప్రయాణం చేసి హైవేకు చేరుకునే వైపు ఫ్రీ లెఫ్ట్ లను విస్తరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో స్పందించి, సహాయం చేసే వారికి నగదు ప్రోత్సాహకాలు అందించాలన్నారు. జివిఎంసి పరిధిలో చేపట్టాల్సిన రోడ్డు, జంక్షన్ల విస్తరణ పనులు, డివైడర్ల నిర్మాణం, ఇనుప గ్రిల్స్ ఏర్పాటు పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు. ఎయిర్ పోర్టు నుంచి గాజువాక వైపు వెళ్లే సర్వీసు రోడ్డు విస్తరణపై జివిఎంసి, ఎయిర్ పోర్టు అధికారులు చర్చించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. రోడ్డుకు మధ్యలో ఎలాంటి ప్రచార బోర్డులు పెట్టరాదని జివిఎంసి అధికారులకు చెప్పారు. షాపింగ్ కాంప్లెక్సుల్లో సెల్లార్ పార్కింగులను ప్రోత్సహించాలని, అలా కాకుండా రోడ్డుపై పార్కింగు చేసే వాహనదారులపై చర్యలు తీసుకోవాలని పోలీసు, జివిఎంసి అధికారులకు చెప్పారు. విశాఖ వ్యాలీ, పోర్టు రోడ్డులో నైట్ పెట్రోలింగ్ పెంచాలని, భవన వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడ వేయకుండా పర్యవేక్షణ చేయాలన్నారు. ఆర్‌టిసి బస్సు డ్రైవర్లు ర్యాష్ డ్రైవింగ్ చేయకుండా నియంత్రించాలని, అవసరమైతే కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు, నిబంధనలను కఠినంగా అమలు చేసేందుకు యంత్రాంగం నుంచి సహకారం కావాలని, ముఖ్యంగా స్పీడ్ లేజర్‌గన్ లు కావాలని కోరారు. రాత్రి పూట బైక్ రేసింగ్ లు చేసే వారిని కట్టడి చేసేందుకు అవి బాగా ఉపకరిస్తాయన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారి లైసెన్స్‌లు రద్దు చేసేందుకు రోడ్డు రవాణా సహకారం అందించాలని, చాలా మంది వివరాలు ఇచ్చినప్పటికీ కొంతమంది లైసెన్సులే రద్దు చేశారని గుర్తు చేశారు. మిగిలిన వాటిపై త్వరగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డిసిపి మణికంఠ చందోలు, గాజువాక ఆర్‌టిఒ సూర్యప్రకాశ్, ఆర్‌టిసి ఆర్‌ఎం అప్పలనాయుడు, ఎంవిఐలు బుచ్చిరాజు, దుర్గాప్రసాద్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు

## ప్రముఖ న్యాయవాది తమ్మన్నశెట్టి ఆత్మహత్య



**విజయనగరం, పతాకం న్యూస్:** ప్రముఖ న్యాయవాది, రాష్ట్ర బార్‌అసోసియేషన్ సభ్యులు కోలగట్ల తమ్మన్నశెట్టి(67) తన ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నారు. యథావిధిగా జిల్లా కోర్టుకు వెళ్లిన మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చారు. అంతలోనే ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. విషయం తెలుసుకున్న ఆయన సోదరుడు మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అక్కడికి చేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనారోగ్య కారణాల వల్లే తన సోదరుడు ఆత్మహత్య చేసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ్మన్నశెట్టికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. జిల్లా కోర్టు నూతన భవనం మంజూరులో తమ్మన్నశెట్టి కీలకపాత్ర పోషించారు. తమ్మన్నశెట్టి మృతదేహాన్ని పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు సందర్శించి నివాళులర్పించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ సిఐ శ్రీనివాసరావు పేర్కొన్నారు

## రైతు సంక్షేమానికి కూటమి కృషి



**విజయనగరం, పతాకం న్యూస్:** రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్ జగదీశ్వరి అన్నారు. పరశురాంపురంలో నిర్వహించిన రైతన్నా.. మీ కోసంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రైతుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై గ్రామస్థాయిలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసే దిశగా రైతులను ఆర్థికంగా ఎదిగేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పరశురాంపురంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్ జగదీశ్వరి ప్రారంభించారు. ఉత్తమ లేగదూడల పాడి రైతులకు బహుమతులు అందజేశారు. సబ్సిడీపై దాణాను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ కర్రక కళావతి, మండల కన్వీనర్ శేఖర్ పాత్రుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ గార గౌరీశంకర్, కూటమి నాయకులు డి.వెంకటనాయుడు, మధుసూదనరావు, శ్రీకర్, సురేష్, సంతోషికుమారి, పశుసంవర్ధకశాఖ జేడీ మన్మథరావు, పశువైద్యులు పాల్గొన్నారు. అయితే లేగదూడల ప్రదర్శన ఉదయం 7 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రారంభం కాకపోవడంతో రైతులుతా అవస్థలు పడ్డారు.

# జీడీపీ సాధనలో బ్యాంకర్లే కీలకం: కలెక్టర్



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** జిల్లా స్థూల జాతీయోత్పత్తి(జీడీపీ) లక్ష్యాల సాధనలో బ్యాంకర్లు ప్రధానపాత్ర వహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లాలోని 3వ త్రైమాసికానికి సంబంధించిన జిల్లా సంప్రదింపుల కమిటీ సమావేశాన్ని.. జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి వర్చువల్‌గా నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 'జిల్లా అభివృద్ధి వేగవంతం కావాలంటే.. వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగం, స్వయంఉపాధి పథకాలకు బ్యాంకులు సకాలంలో రుణాలు మంజూరు చేయాలి. పీఎంఈజీపీ, పీఎంఎఫ్‌ఎంఈ, పీఎం విశ్వకర్మ, పీఎం సూర్యఘర్, స్వయం సహాయక సంఘాలు, వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించిన రుణాల మంజూరులో జాప్యం వద్దు. బ్యాంకులు, వివిధ శాఖలు సమన్వయంతో పనిచేస్తే జీడీపీ లక్ష్యాలను సులభంగా సాధించవచ్చ'ని తెలిపారు. నాబార్డు అంచనాల ప్రకారం 2026-27కి సంబంధించి జిల్లా రుణ అవసరాలు రూ.13,526.92 కోట్లుగా అంచనా వేశారు. సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ పేడాడ శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ జేడీ త్రినాథస్వామి, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, మెప్మా పీడీ వెంకటరావు, మత్స్యశాఖ డీడీ సత్యనారాయణ, నాబార్డు మేనేజర్ రమేష్‌కృష్ణ, రాకేష్ కృష్ణ, బ్యాంకుల కంట్రోలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పొగిరిలో ప్రబలిన డయేరియా



**రాజాం, పతాకం న్యూస్:**మండలంలోని పొగిరి గ్రామంలో డయేరియా ప్రబలింది. పది మంది వరకు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. గ్రామంలోని ఎగువ వీధిలో పలువురికి విరేచనాలు, వాంతులు వంటి లక్షణాలు కనిపించడంతో గ్రామస్థుల్లో ఆందోళన నెలకొంది. గత మూడు రోజులుగా బాధితుల సంఖ్య క్రమంగా పెరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. పరిస్థితి విషమించడంతో ఐదుగురు రోగులను శ్రీకాకుళంలోని రిమ్ ఆస్పత్రికి తరలించగా, మరో ఇద్దరు స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మిగతా వారు ఇళ్ల వద్దే చికిత్స పొందుతున్నారు. లేదా ఆహార పదార్థాల ద్వారా ఇన్ఫెక్షన్ వ్యాపించిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిణామాలపై అప్రమత్తమైన పంచాయతీ అధికారులు, వైద్య సిబ్బంది చర్యలు చేపట్టారు. పొగిరి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ గట్టి భార్గవి ఆధ్వర్యంలో గ్రామంలో ఫివర్ సర్వే, విస్తృత పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వైద్య బృందాలు ఇంటింటా తనిఖీలు చేస్తూ, బాధితులకు మందులు అందజేసి, అవసరమైన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నాయి.

## వెంటనే టిడ్కో ఇళ్లు అప్పగించాలి




**పార్వతీపురం, పతాకం న్యూస్:** పూర్తయిన టిడ్కో ఇళ్లను తక్షణమే లబ్ధిదారులకు అప్పజెప్పాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టిడ్కో ఇళ్లు పంపిణీ చేయాలని నాలుగు రోజులపాటు పట్టణంలో సిపిఎం ఆధ్వర్యాన చేపట్టే ప్రచార యాత్రను 24వ వార్డులో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017లో అప్పటి టిడిపి ప్రభుత్వం ప్రారంభించిన టిడ్కో ఇళ్ల పథకం ప్రహసనంగా మారిందన్నారు. సుమారు 75 కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన టిడ్కో ఇళ్లు పంపిణీ చేయకపోవడం అన్యాయమన్నారు. నిర్మాణం పూర్తయినప్పటికీ లబ్ధిదారులకు అప్పగించకుండా కోట్లాది రూపాయల దుర్వినియోగానికి కారణం అవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండేళ్లు గడుస్తున్నా టిడ్కో ఇళ్లు అప్పగించేందుకు చర్యలు చేపట్టకపోవడం సమంజసం కాదని విమర్శించారు. ఇప్పటికైనా పార్వతీపురం పట్టణ పేదలకు టిడ్కో గృహాలను తక్షణమే అప్పగించాలని, మిగిలిన లబ్ధిదారులు చెల్లించిన షేర్ కేపిటల్ డబ్బులు వడ్డీతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, జిల్లా కమిటీ సభ్యులు బివి రమణ, పట్టణ నాయకులు పాకల సన్యాసిరావు, బి.సూరిబాబు, బి.లక్ష్మి, ఎస్.శ్రీనివాసరావు, హనుమంతు రాము, ఎం.నరసింహ మూర్తి, రమణమ్మ, మంగ, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి పన్ను లక్ష్యాలను సాధించాలి



**రేగిడి, పతాకం న్యూస్:** ఇంటి పన్ను, కుటుంబ సమగ్రసర్వే లక్ష్యాలను శతశాతం సాధించాలని, సచివాలయ రికార్డులను పక్కాగా నిర్వహించాలని చీపురు పల్లి డీఎల్‌డీవో కె.హేమసుందరరావు ఆదేశించారు. మండలంలో ఉంగరాడ సచివాలయన్ని ఎంపీడీవో శ్యామలాకుమారితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉంగరాడ, అంబఖండి, గుళ్లపాడు, సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. సచివాలయ సిబ్బది మూమెంట్ రిజిస్టర్, స్వర్ణ పంచాయతీ రికార్డుల నిర్వహణ లోపాలపై మండి పడ్డారు. సిబ్బంది బయటకు వెళ్లితే రికార్డుల్లో పొందుపరచాలని, పాలనాపరమైన లక్ష్యా ల్లో వెనకబాటు ఉండరాదని తెలిపారు. అనంతరం మండలంలో 39 పంచాయతీల ఇంటి పన్నుల వసూళ్లపై ఎంపీడీవోతో సమీక్షించారు. ఆయన వెంట అంబఖండి, ఉంగరాడ, గుళ్లపాడు కార్యదర్శులు హేమసుందరరావు, గౌరమ్మ, ఆశాస్వాతి ఉన్నారు.

## విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం

**హైదరాబాద్, పతాకం న్యూస్:** తెలంగాణలో విద్య, వైద్య రంగాలకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ రెండు రంగాలకు కేటాయించిన నిధుల్లో ఒక్క రూపాయి కూడా కోత విధించే ప్రసక్తే లేదని, అవసరమైతే మరిన్ని నిధులు కేటాయిస్తామని అసెంబ్లీ వేదికగా హామీ ఇచ్చారు. గురువారం శాసనసభలో పద్దులపై జరిగిన చర్చకు ఆయన సమాధానమిచ్చారు. ఆరోగ్యశ్రీ పథకం కింద బకాయిలు పేరుకుపోవడంతో ప్రైవేటు ఆసుపత్రులు మూతపడుతున్నాయంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని సీఎం కొట్టిపారేశారు. తాము అధికారంలోకి వచ్చే నాటికి గత ప్రభుత్వం రూ. 627 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలను మిగిల్చిందని, ఆ భారాన్ని మోస్తూనే పథకం పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచామని గుర్తుచేశారు. 2023 డిసెంబర్ 8 నుంచి ఇప్పటివరకు ఆరోగ్యశ్రీ కింద ప్రభుత్వ ఆసుపత్రులకు రూ. 927 కోట్లు, ప్రైవేటు ఆసుపత్రులకు రూ. 1,480 కోట్లు కలిపి మొత్తం రూ. 2,408 కోట్లు చెల్లించామని వివరించారు. ప్రస్తుతం చెల్లించాల్సిన రూ. 727 కోట్ల బకాయిల్లో అత్యధికం గత ప్రభుత్వానివేనని తెలిపారు.రాష్ట్రంలోని 35 మెడికల్ కాలేజీలకు అనుబంధంగా ఉన్న బోధనాసుపత్రులకు రోగులు వెళ్లడం లేదని, అక్కడ వైద్యుల కొరత ఉందని సీఎం అంగీకరించారు. ఈ ఆసుపత్రులను బలోపేతం చేసేందుకు ఆరోగ్యశ్రీ రోగులను అక్కడికి రిఫర్ చేసే ప్రతిపాదనను పరిశీలిస్తున్నామన్నారు.

## మ్యుటేషన్స్ తిరస్కరణ తగ్గాలి: కలెక్టర్



**విజయనగరం, పతాకం న్యూస్:** జిల్లాలో పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీని వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. . పట్టాదారు పాసుపుస్తకాలు, రీసర్వే, 22 ఎ భూములు తదితర రెవెన్యూ అంశాలపై దిశానిర్ధేశం చేశారు. వీటిపై జెసి సేదు మాధవన్ తో కలిసి సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమం, రీసర్వే వేగవంతం చేయాలని తహశీల్దారులను ఆదేశించారు.. ఒక్క తప్పుకూడా లేకుండా పాసుపుస్తకాలను రూపొందించాలని, రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని స్పష్టం చేశారు. మ్యుటేషన్లను వీలైనంత వేగంగా పూర్తి చేయాలని సూచించారు. డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని, దీనిలో జిల్లా వెనుకబడి ఉందని దానిని మెరుగుపరచాలని కోరారు. జిల్లాలో గ్యాస్ కొరత లేదు ఈ సందర్భంగా జెసి సేదు మాధవన్ మాట్లాడుతూ జిల్లాలో ఎల్ పి జి కొరత లేదని అన్నారు. ఇళ్లకు సప్లయి చేసే సిలిండర్లు ఎంత మాత్రం కొరత లేకుండా, పాఠశాలలు సాంఘిక సంక్షేమ, బిసి వెల్ఫేర్, వసతి గృహాలు మొదలగు వాటికి కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. వాట్సప్ గవర్నెన్స్ సేవలు పెరగాలని రెవిన్యూ అధికారులకు జెసి ఆదేశించారు. ఐవిఆర్ఎస్, ఇంటర్ డిపార్టుమెంటల్ అంశాలపై జిల్లా అధికారులతో జెసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవిన్యూ పిటిషన్లుకు సంబంధించి తహశీల్దార్లు వ్యక్తిగతంగా హాజరు కావాలని అన్నారు. రెవెన్యూ క్లినిక్‌లో వచ్చిన పిటీషన్లను పెండింగ్లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. 22 ఏ, రీ సర్వే, జాయింట్ ఎల్ పి ఎం లు తదితర విషయాలపై జెసి సమీక్షించారు. ఈ సమావేశం లో డి.ఆర్.ఓ సత్తిబాబు , ఎస్ డి సి ఇ. మురళి , ఆర్ట్.డి.ఓ లు , పాల్గొన్నారు. వర్చువల్ గా తహసిల్దార్లు, ఎం.పి.డి.ఓ లు, పాల్గొన్నారు.

## జైళ్లలో కులవివక్ష ఉండకూడదు



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** జైళ్లలో శిక్ష అనుభవి స్తున్న ఖైదీల మధ్య కుల వివక్షకు తావుండరాదని జిల్లా న్యాయాధి కారి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి, బోర్డు ఆఫ్ విజిటర్స్‌తో కలసి జిల్లా జైలును ఆయన తనిఖీ చేశారు. రిజిస్టర్లు, ఫార్మెట్లను పరిశీలించారు. కులంతో సంబంధం లేకుండా అందరికీ అన్ని సౌక ర్యాలు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సరైన న్యాయ ప్రాతినిధ్యం లేని ఖైదీల వివరాలు సేకరించి.. వారికి తక్షణమే బెయిలు దరఖాస్తులు... ఇతర చట్టపరమైన అంశాల్లో ఉపశమనం కలిగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలల్లో కాలేజీలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

**గుంటూరు, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ గుంటూరు ఆధ్వర్యంలో నడుస్తున్న ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలల్లో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశ నోటిఫికేషన్ విడుదలైంది. గుంటూరు జిల్లాలోని నందివెలుగు రోడ్డులో గల సుభాష్ నగర్ కాలనీలోని గల ఉర్దూ బాలుర గురుకుల పాఠశాల, సంగడిగుంట లో గల బాలికల గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి, ఆరు, ఏడు ,ఎనిమిది తరగతులలో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ ఎం రజిని తెలిపారు. అలాగే ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ ఉర్దూ బాలుర లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం నందు ఎంపీసీ, బైపిసి మరియు సీఈ సెలలో అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానించటమైనది అని జిల్లా కన్వీనర్ తెలిపారు. దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ ఏప్రిల్ 7 కాగా, ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 24న నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు అధికారిక వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ముస్లింలు క్రిస్టియన్లు సిక్కులు జైనులు మరియు బౌద్ధ మైనారిటీ విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరడమైనది.

## ఆలయాల పునర్జీవానికి కృషి



**నెల్లిమర్ల, పతాకం న్యూస్:** రాష్ట్రంలో ఆలయాల పునర్జీవానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖామంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. రామతీర్థం నీలాచలం (బోడికొండ) చుట్టూ గిరి ప్రదర్శన కోసం రూ.3.40కోట్ల గ్రామీణ ఉపాధిహామీ నిధులతో 3.7 కిలోమీటర్ల మేర కొత్తగా నిర్మించిన గిరివలయం బిటి రహదారిని పవన్ కల్యాణ్ బుధవారం అమరావతినుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంచాయతీరాజ్, సాస్కి నిధులు సుమారు రూ.40కోట్లతో 22 ప్రధాన ఆలయాల వద్ద అభివృద్ధి పనులను మంజూరు చేశామన్నారు. రామతీర్థం గిరి ప్రదర్శనకు వచ్చే భక్తుల ఇబ్బందులు తొలగించడానికి రూ.3.40 కోట్లతో ఈ రహదారిని మంజూరు చేశామని తెలిపారు. మన సంస్కృతిని పరిరక్షించేందుకు, సంప్రదాయాలను కాపాడేందుకు, ఆలయాల పవిత్రతను రక్షించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్న జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆలయాల వద్ద సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రాంనారాయణరెడ్డి మాట్లాడుతూ, సంక్షేమం, అభివృద్ధితోపాటు, ఆధ్యాత్మిక ఆంధ్రప్రదేశ్ గా రూపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ధూపదీప నైవేధ్య పథకం, కామన్ గుడ్ ఫండ్, శ్రీవాణి ట్రస్టు నిధులతో రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఆలయాల అభివృద్ధికి, నిర్మాణానికి కృషి చేస్తున్నామని మంత్రి వివరించారు. రాష్ట్ర ఎంఎస్ఎంఇ శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రతీ దేవాలయాన్ని అభివద్ది చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 5వేల ఆలయాల్లో భజన మండళ్ల నిర్మాణానికి దేవాదాయశాఖ ద్వారా నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ రామతీర్థం అభివృద్ధికి తనవంతు సహకారాన్ని అందిస్తామని చెప్పారు. రామతీర్థంలో కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ, రామతీర్థం గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా విలసిల్లుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే లోకం మాధవి, విజయనగరం ఎంఎల్ఏ పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, బిజెపి జిల్లా అధ్యక్షులు రాజేష్‌వర్మతో పాటు కూటమి నాయకులు కందిచంద్రశేఖర్, చనుమల్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలను బలోపేతం చేయాలి



**నరసన్నపేట, పతాకం న్యూస్:** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో ఉపాధ్యాయులే కీలక పాత్ర పోషించాలని విశాఖ రీజియన్ ప్రాథమిక విద్య జా యింట్ డైరెక్టర్ విజయభాస్కర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో హెచ్ఎంలతో ఎన్‌రోల్‌మెంట్, ఉపాధ్యాయుల వృత్తిపరమైన నైపుణ్యం తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతతో... ఇష్టంతో పని చేయాలన్నారు. ఉపాధ్యాయుడు పుస్తక పఠనం.. వ్యాయమం... యోగాకు ప్రాధాన్యమివ్వాలని ఆర్జేడీ చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవో ఉప్పాడ శాంతారావు, పేడాడ దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే నరసన్నపేట, పోలాకి, జలుమూరు మండలాల్లోని పలు పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఆర్జేడీ పరిశీలించారు.

## గాల్లో ఉండగా సాంకేతిక లోపం... తిరిగొచ్చిన ఢిల్లీ-లండన్ ఎయిరిండియా విమానం

**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఢిల్లీ నుంచి లండన్ బయలుదేరిన ఎయిరిండియా విమానం గాలిలో ఉండగా సాంకేతిక సమస్య తలెత్తడంతో గురువారం మధ్యాహ్నం తిరిగి జాతీయ రాజధానికి చేరుకుంది. ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎయిరిండియా వర్గాలు వెల్లడించాయి. వివరాల్లోకి వెళితే, ఏఐ111 విమానం గురువారం ఉదయం 6 గంటలకు ఢిల్లీలో టేకాఫ్ అయింది. అయితే, గాలిలో ప్రయాణిస్తున్న సమయంలో విమానంలో అనుమానిత సాంకేతిక లోపాన్ని సిబ్బంది గుర్తించారు. దీంతో, దాదాపు ఏడు గంటల ప్రయాణం తర్వాత మధ్యాహ్నం 12:30 గంటలకు విమానాన్ని తిరిగి ఢిల్లీలో సురక్షితంగా ల్యాండ్ చేశారు. ఈ ఘటనపై ఎయిరిండియా ప్రతినిధి మాట్లాడుతూ, ప్రయాణికుల భద్రతకే తమ ప్రథమ ప్రాధాన్యత అని, ముందుజాగ్రత్త చర్యగా విమానాన్ని వెనక్కి పిలిపించినట్లు తెలిపారు.

## పెరగనున్న వార్డుల సంఖ్య




**విజయనగరం, పతాకం న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం నగర పాలక సంస్థల్లో వార్డుల సంఖ్యను పెంచేందుకు జీవో 65ను విడుదల చేసింది. వార్డుల పెంపుతో విజయనగరంలో కార్పొరేటర్ల సంఖ్య పెరగనుంది. రాజకీయ నిరుద్యోగులు ఈ వార్డుల పెంపు మంచి అవకాశంగా భావిస్తున్నారు.మున్సిపల్‌శాఖ విడుదల చేసిన ఈ జీవోలో పేర్కొన్న ఆదేశాలు ప్రకారం 2లక్షలలోపు జనాభా ఉన్న కార్పొరేషన్లలో 60 వార్డులను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. 2నుంచి 3లక్షల లోపుజనాభా ఉన్న కార్పొరేషన్లలో 62, మూడు నుంచి నాలుగు లక్షల జనాభా ఉన్న చోట 66 వార్డులకు పెంచనున్నారు. ఈ నేపథ్యంలో వరకు విజయనగరం కార్పొరేషన్‌లో ఉన్న వార్డుల సంఖ్య 50నుంచి 62 లేదా 66కు పెరిగే అవకాశం కనిపిస్తుంది. ప్రభుత్వం విడుదల చేసిన ఆదేశాల్లో 2011 జనాభా లెక్కలు ప్రకారం 10 శాతం జనాభాను కలిపి 2 నుంచి 3 లక్షలు జనాభా ఉన్న నగర పాలక సంస్థకు వార్డుల సంఖ్య 62కు పెరగనున్నట్లు పేర్కొంది. ఆ విధంగా చూసుకుంటే విజయనగరం నగర పాలక సంస్థ 2011 జనాభా లెక్కలు ప్రకారం 2,44,598 మంది ఉన్నారు. ప్రభుత్వం పేర్కొన్న ప్రకారం 10 శాతం కలుపుకుంటే 2,69,000 పైగా జనాభా తీసుకుంటే విజయనగరం నగర పాలక సంస్థలో 50 డివిజన్ల నుంచి 62డివిజన్లగా పెరగనున్నాయి. అదే వచ్చే ఏడాది చేపట్టనున్న జనాభా లెక్కలు ఆధారంగా అయితే వార్డుల సంఖ్య 66కు పెరిగే అవకాశముంది. 27 వార్డుల నుంచి ప్రారంభం... 66వరకువిజయనగరం 1888 లో మున్సిపల్ అసోసియేషన్‌గా నలుగురు సభ్యులతో ఏర్పడింది. ఆ తర్వాత పార్టీలు అధారంగా 1948 లో తొలి మున్సిపల్ ఎన్నికలు 27 వార్డులకు జరిగింది. అక్కడ నుంచి మున్సిపాల్టీగా ఉంటూ 1971 లో సోషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా, 1998 లో సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా మారిన తర్వాత 40 వార్డులుగా విభజించారు. 2019లో నగర పాలక సంస్థ గా మారింది. దీంతో 50 వార్డులుగా విభజించి 2020లో ఎన్నికలు నిర్వహించారు. తాజాగా ప్రభుత్వం ఈనెల 24న ఇచ్చిన జీవో 65 ప్రకారం నగర పాలక సంస్థలో వార్డుల సంఖ్య 62 లేదా 66కు పెరగనుంది.మారనున్న వార్డుల భౌగోళిక సరిహద్దులు..నగరపాలక సంస్థలో ఇప్పటివరకు ఉన్న 50 డివిజన్ల భౌగోళిక పరిస్థితులు మార నున్నాయి. 2020లో నగర పాలక సంస్థ ఎన్నికలకు ముందు వార్డులు విభజన జరిగింది. అప్పట్లో జరిగిన డివిజన్ల విభజన సహేతుకంగా లేదనే విమర్శలు కూడా వచ్చాయి. సరిహద్దులు సరిగ్గా లేక పోవడం వలన అప్పటి వరకు ఉన్న ఒకే డివిజన్‌లో ఉన్న జనాభా మూడు డివిజన్లలోకి వెళ్లాల్సి వచ్చింది. ఉదాహరణకు కెవెల్ పురం వార్డు 50 డివిజన్‌లో కొన్ని నివాసాలు, 44 డివిజనులో కొన్ని, 45 వ డివిజన్లలో కొన్ని నివాసాలు వచ్చాయి. కెవెల్ పురంగా ఉన్న ప్రాంతం మూడు వార్డులకు పంచడం వలన స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం వార్డుల విభజనకు అవకాశం జీవో65 ద్వారా కల్పించడంతో కొత్తగా వార్డుల ఏర్పడటంతో పాటు ముక్కలైన డివిజన్లను గాడిలో పెట్టే అవకాశం కలిగింది. త్వరలో జరగనున్న నగర పాలక సంస్థ ఎన్నికలకు ఓటర్లు సంఖ్య కూడా సమతుల్యంగా వచ్చే అవకాశం ఉంటుందని అధికారులు తెలియజేస్తున్నారు.

## అరటి రైతులను ఆదుకోవాలి: షర్మిల



**కడప, పతాకం న్యూస్:** అరటి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ఈ మేరకు కడప జిల్లా కాంగ్రెస్ కార్యాలయం నుంచి అరటి గెలల వ్యాన్‌ను తీసుకుని ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. పంట నష్టపోయిన అరటి రైతులను తక్షణం ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ జాయింట్ కలెక్టర్ నిధిమీనాకు వినతి పత్రం అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురం మండలం కసునూరు గ్రామంలో వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలించామని, రైతులతో మాట్లాడి వారి కష్టాలను అడిగి తెలుసుకున్నామని తెలిపారు. రైతులు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను జెసికి వివరించామని పేర్కొన్నారు. అకాల వర్షానికి అరటి రైతులు సర్వం కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. టన్ను రూ. 26 వేలు పలికిన అరటి ప్రస్తుతం రూ. ఆరు వేలకు పడిపోయిందన్నారు. పంటకు గిట్టుబాటు ధర వచ్చేంత వరకూ నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజీలు లేకపోవడంతో ప్రాసెసింగ్ ప్లాంట్‌లు లేక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కోల్డ్ స్టోరేజీలు, ప్రాసెసింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేయడంతో పాటు మార్కెటింగ్ సపోర్ట్ కల్పించాలని కోరారు. అరటికీ కనీసం గిట్టుబాటు ధర 12 వేల రూపాయలు కల్పించాలని డిమాండ్ చేశారు.

## క్లాస్ రూంలో ప్రపోజ్ చేసిన ప్రొఫెసర్... చెప్పుతో కొట్టిన మెడికల్ విద్యార్థిని

**బెంగళూరు, పతాకం న్యూస్:** బెంగళూరు శివార్లలోని ఓ ప్రైవేట్ మెడికల్ కాలేజీలో దారుణ ఘటన చోటుచేసుకుంది. తరగతి గదిలో లెక్చర్ చెబుతూనే ఓ విద్యార్థినికి ప్రేమ ప్రతిపాదన చేసిన ప్రొఫెసర్‌పై తోటి విద్యార్థులు దేహశుద్ధి చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర కలకలం రేగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, నెల్లమంగళ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ మెడికల్ కాలేజీలో ఈ సంఘటన జరిగింది. క్లాస్ జరుగుతుండగా, ప్రొఫెసర్ ఓ విద్యార్థినికి చాక్లెట్ అందించి, అందరి ముందే తన ప్రేమను వ్యక్తం చేశారు. "ఈ బ్యాచ్‌లోని చాలా ముఖ్యమైన అమ్మాయికి, మీ అందరికీ చాక్లెట్లు ఇస్తున్నాను... ఐ లవ్ యూ" అని చెప్పినట్లు వీడియోలో రికార్డయింది. దీంతో ఆ విద్యార్థిని వెంటనే అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రొఫెసర్ ప్రవర్తనను ప్రశ్నిస్తూ, తన చెప్పుతో కొట్టింది. ఇతర విద్యార్థులు కూడా ప్రొఫెసర్‌పై క్యాంపస్‌లో దాడి చేశారు. అతనిని కారు వరకు తరిమి చితకబాదారు. వారి నుంచి తప్పించుకున్న ప్రొఫెసర్, అక్కడి నుంచి పరారయ్యాడు. అంతకుముందు క్లాస్‌లో విద్యార్థిని ఎదురుతిరగడంతో, ఆమె కూడా తనకు ప్రపోజ్ చేసిందని, దానికి సీసీటీవీ ఫుటేజీలో ఆధారం ఉందని ప్రొఫెసర్ చెప్పాడు.

# ముందుకు సాగని ఇళ్ల నిర్మాణాలు



**అనకాపల్లి, పతాకం న్యూస్:** జిల్లాలో పేదల ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారుల ఎంపిక, గత ప్రభుత్వ హయాంలో మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. పీఎం ఆవాస్ యోజన 2.0 కింద ఇళ్ల స్థలాలు, ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న పేదలు మంజూరు కోసం నెలల తరబడి ఎదురు చూస్తున్నారు. మరోవైపు గత ప్రభుత్వ హయాంలో మంజూరై, పూర్తికాని ఇళ్లకు ప్రస్తుత ప్రభుత్వం అదనంగాని నిధులు ఇచ్చినప్పటికీ పనులు పూర్తికాని పరిస్థితి నెలకొంది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ్) 2.0 కింద అర్హులైన పేదలకు సొంత ఇళ్లు మంజూరు చేయాలని కూటమి ప్రభుత్వం గత ఏడాది నిర్ణయించింది. వితంతువులు, దివ్యాంగులు, వయోవృద్ధులు, ఎస్సీ, ఎస్టీలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించింది. దీంతో జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో దరఖాస్తులు అందాయి. కానీ ఇళ్ల మంజూరులో తీవ్ర జాప్యం జరగుతున్నది. పీఎంఏవై 2.0 కింద గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి స్థలాలు, పక్కా ఇళ్లు మంజూరు చేయాలని గత ఏడాది డిసెంబరు నాటికి సుమారు 42 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారులు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా అందిన దరఖాస్తులను పరిశీలించి, అర్హుల జాబితాలను ప్రభుత్వానికి పంపారు. మరోవైపు ఇళ్ల కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుండడంతో దరఖాస్తులు అందుతూనే ఉన్నాయి. ప్రభుత్వానికి పంపిన జాబితాకు ఇంతవరకు ఆమోదం లభించలేదు. ప్రస్తుతం వ్యవసాయ పనులు అంతగా లేవని, వేసవి కావడంతో ఇళ్ల నిర్మాణానికి వాతావరణం అనుకూలంగా వుంటుందని, అందువల్ల సత్వరమే ఇళ్లు మంజూరు చేయాలని లబ్ధిదారులు మండలాల్లో గృహ నిర్మాణ శాఖ కార్యాలయాలకు వెళ్లి అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే ప్రభుత్వం నుంచి పరిపాలనాపరమైన అమోదం లభించలేదని అధికారులు చెబుతుండడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు. ఇక గత వైసీపీ హయాంలో జగనన్న కాలనీల పేరుతో లేఅవుట్లు వేసి స్థలాలు, ఇళ్లు మంజూరు చేశారు. అయితే చాలాచోట్ల ఇళ్ల స్థలాలు ఇచ్చిన ప్రదేశాలు గ్రామానికి చాలా దూరంలో వుండడం, కొండవాలు ప్రదేశాలు కావడం, లోతట్టు ప్రాంతం కావడం, రహదారులు, నీటిసదుపాయం లేకపోవడం వంటి కారణాల వల్ల చాలా మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేదు. మరికొంతమంది ఇళ్ల నిర్మాణాలు చేపట్టినప్పటికీ ప్రభుత్వం ఇచ్చే నిధులు చాలకపోవడం, బిల్లులు మంజూరు కాకపోవడం, సిమెంటు, ఇసుక, ఇనుమును అధికారులు సరఫరా చేయకపోవడంతో మధ్యలోనే ఆపేశారు. మొత్తం మీద గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో 52 వేల మందికి ఇళ్లు మంజూరుకాగా, ఇంతవరకు 33 వేల ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అసంపూర్తిగా వున్న ఇళ్లను పూర్తి చేసేందుకు ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు అదనంగా రూ.50 వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75 వేల చొప్పున మంజూరు చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. అయినప్పటికీ నిధులు చాలవన్న ఉద్దేశంతో ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసేందుకు లబ్ధిదారులు ముందుకు రానిపరిస్థితి నెలకొంది. గత ఏడాది ఐదు వేలమందికి అదనపు ప్రోత్సాహంగా నగదు అందించి, ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించాలని జిల్లా గృహ నిర్మాణ సంస్థ అధికారులు లక్ష్యంగా పెట్టుకోగా, వీరిలో 3,115 మంది మాత్రమే ముందుకొచ్చారు. వీరిలో అనకాపల్లి నియోజకవర్గం లబ్ధిదారులు 293 మంది, చోడవరంలో 384 మంది, మాడుగులలో 426 మంది, నర్సీపట్నంలో 575 మంది, పాయకరావుపేటలో 733 మంది, పెందుర్తి(పరవాడ, సబ్బవరం మండలాలు)లో 277 మంది, ఎలమంచిలిలో 427 మంది వున్నారు. వీరిలో కూడా దాదాపు సగం మంది ఇంకా ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయలేదు.

# ఎరువుల ధరలకు రెక్కలు.. ఆందోళనలో అన్నదాతలు

**అమరావతి, పతాకం న్యూస్:** వరి సాగుకు పెట్టుబడి వ్యయం నానాటికీ పెరిగిపోతుండడంతో అన్నదాత అప్పుల పాలవుతున్నాడు. బతుకుదెరువు కోసం నమ్ముకున్న వరి సాగు ఆశించిన స్థాయిలో ఫలించక రైతులకు ఆర్థిక ఇబ్బందులు తప్పడంలేదు. వరిసాగుకు వినియోగించే రసాయనిక ఎరువుల ధరలు ఒక్కసారిగా భారీగా పెరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నారు దగ్గర నుంచి పంట ఈనిక దశకు వచ్చే వరకు దశలవారీగా కాంప్లెక్స్ ఎరువులు వాడాల్సి ఉంటుంది. ఎరువుల ధరలు పెరగడంతో వరిసాగు ఉత్పాదక వ్యయం మరింతగా పెరిగి రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఎరువులు, రసాయనిక మందులు ధరలతోపాటు కూలీల వ్యయం కూడా పెరుగుతూ రావడం అన్నదాతకు మరింత ఇబ్బంది కలిస్తోంది. క్రమంగా ఏటా వరి ఉత్పాదక వ్యయం పెరుగుతుంటే ధాన్యానికి మాత్రం గిట్టుబాట ధర లేక రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. ఇక ప్రకృతి వైపరీత్యాలు మరో వంక అన్నదాతను ఇక్కట్ల పాలు చేస్తున్నాయి.ఎరువుల ధరలు పెరిగింది ఇలారెండేళ్లుగా కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెరుగుతూ ఉన్నాయి. 14-30-14 బస్తా రూ.1,800 నుంచి రూ.2,150కి పెరిగింది. 10-26-26 రకం రూ.1,600 నుంచి రూ.1,950కు పెరిగింది. 28-28 రకం రూ.1,350 నుంచి రూ.1,500 వరకు,15-15-15 రకం రూ.1,300 నుంచి రూ.1,650కు పెరిగింది. పటాస్పస్తా రూ.1,600 నుంచి రూ.1,800కు పెరిగింది.నాలుగు నెలల్లో రెండు దఫాలు పెరుగుదలరసాయన మిశ్రమ ఎరువుల ధరలను నాలుగు నెలల కాలంలో రెండు సార్లు పెంచడంతో రైతులపై పెట్టుబడి భారం అధికమైంది. యూరియా, డిఎపి మినహా మిగిలినవి 50 కిలోల బస్తాకు రూ.200 నుంచి రూ.400ల వరకు పెరిగింది. జిల్లాలో 2.30 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతున్నాయి. కొనుగోలుకు వెళ్లే వరకు ఎరువుల ధరలు పెరిగాయనే విషయం తమకు తెలియడం లేదని కర్షకులు వాపోతున్నారు. అధికంగా వినియోగించే 14-35-14 బస్తా ధర గత డిశంబర్లో రూ.1,750కు విక్రయించగా.. ఆ తర్వాత రూ.1900, ప్రస్తుతం రూ.2,150కి అమ్ముతున్నారు. బస్తాకి రూ.400 పెరగడంతో సాగుదారులు లబోదిబోమంటున్నారు. వరికి వేసే 20-20-0-13 బస్తాకి రూ.200 పెరిగింది. ఈ కారణంగా ఎకరాకు సుమారు రూ.800 నుంచి రూ.1,200ల వరకు పెట్టుబడి పెరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిశ్రమ ఎరువుల తయారీకి అవసరమైన ముడి




సరకు విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి ఉందని, అంతర్జాతీయ మార్కెట్లో వీటి ధరలు పెరగడంతో ధరలు పెంచినట్లు కంపెనీల డీలర్లు చెబుతున్నారు. అధికారులు మాత్రం మోతాదుకు మించి ఎరువులు వేయకుండా సూచనల మేరకు వేసుకుని పెట్టుబడి వ్యయం తగ్గించుకోవాలని సూచిస్తున్నారు. మరోపక్క ఎరువుల ధరలు పెరుగుదలపై రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పెరిగిన దమ్ము రేట్లురెండేళ్ల క్రితం ఎకరం పొలం దమ్ముకు రూ.3.000 ఖర్చయ్యేది. అనంతరం ఎకరాకు రూ.3,500 నుంచి రూ.4,500కు పెరిగింది. కూలీలకు రూ.6,000కు వ్యయమవుతోంది. వలస కూలీలకు ఖర్చు తగ్గుతున్నా, పైరుకు అధిక మొత్తంలో ఎరువులు వాడాల్సి వస్తోంది. వరి సాగులో యంత్రాల వినియోగంపై నానాటికీ ఖర్చు పెరుగుతోంది. కోతకు యంత్రానికి గతంలో రూ.4,000 పెట్టుబడి ప్రస్తుతం రూ.6,000 ఖర్చవుతోంది.

## దళారుల నుండి విముక్తి చేయండి

**కర్నూలు,, పతాకం న్యూస్:** సి క్యాంపు రైతు బజారు దళారుల మయమైందని దళారుల నుండి విముక్తి చేసి ఆకుకూరలు కూరగాయలు పండించే వాస్తవ రైతులకు అవకాశం కల్పించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం కార్మిక కర్షక భవన్లోని రైతు సంఘం కార్యాలయంలో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ తో పాటు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఏ. కృష్ణ జిల్లా నాయకులు జి. ఆంజనేయులు ఈ. తాండ్రపాడు సర్పంచ్ బాలపీరా గారలు పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రంలో రైతు బజార్లు నెలకొల్పడం ఉద్దేశం రైతులు పండించిన కూరగాయలు ఆకుకూరలు వారే స్వయంగా అమ్ముకోవడం వల్ల మంచి రేటు వచ్చి రైతులకు ఆపదాయకంగా ఉండాలని అదేవిధంగా వినియోగదారులకు నాణ్యమైన మంచి కూరగాయలు ఆకుకూరలు లభించాలని ఉద్దేశంతో ప్రభుత్వము నాడు రైతు బజార్లను ఏర్పాటు చేస్తే అందులో రాష్ట్రంలోనే సి క్యాంప్ రైతు బజారు ప్రథమ స్థానంలో నిలిచిందని వారు తెలిపారు .అయితే రాను రాను ఎ. క్యాంప్ రైతు బజార్లో రైతులు కాకుండా దళారుల వశమైందని వారు ఆవేదన వ్యక్తం చేశారు ఈ పరిస్థితిని అనేక సందర్భాలలో రైతులు, రైతు సంఘాలు అధికారుల దృష్టికి తీసుకొచ్చినప్పటికీ ఫలితం లేకుండా పోతుందని వారు ఈ సందర్భంగా తెలిపారు. దళారులను అక్కడి నుండి కదిలించడానికి ప్రయత్నం చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సిందే వస్తుందని భయాందోళనకు గురవు తున్నట్లు వారు తెలిపారు ఫలితంగా సి క్యాంపు రైతు బజార్లో దళారులదే రాజ్యమవుతుంది తప్ప వాస్తవంగా కూరగాయలు ఆకుకూరలు పండించిన రైతులకు అవకాశం లేకుండా పోతుందని తెలిపారు ఇప్పటికైనా ఉన్నతాధికారులు అదేవిధంగా పోలీసు ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని దళారుల యొక్క ఆగడాలను నియంత్రించి స్వచ్ఛమైన రైతుబజారుగా నిలబెట్టేందుకు అధికారులు కృషి చేయాలని లేకపోతే మరికొంత కాలానికి దళారులు తప్ప రైతులు ఒక్కరు కూడా రైతు బజార్లో మిగలరని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

## మహిళలపై అత్యాచారాల పట్ల కఠిన శిక్ష




**కాకినాడ, పతాకం న్యూస్:** మహిళల మీద అత్యాచారాలకు పాల్పడితే అదే వారికి ఆఖరి రోజు అని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ హెచ్చరించారు. పాత కొట్టాం పంచాయతీ సంఘవాకలో ఈ నెల 18న అత్యాచారానికి గురై ఆస్పత్రిలో విషమ స్థితిలో ఉన్న బాధితురాలిని శైలజ పరామర్శించారు. అనంతరం విలేకరులతో శైలజ మాట్లాడారు. బాధితురాలు పూర్తిగా స్పృహలోకి రాలేదని, ఇప్పుడిప్పుడే కోలుకుంటోందని, నిందితులను పూర్తిగా గుర్తించే స్థితిలో లేదని చెప్పారు. 17 ఏళ్ల యువకుడు ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని పోలీసులు గుర్తించారని తెలిపారు. ఆ యువకుడు జులాయిగా తిరుగుతాడని స్థానికులు తెలిపారన్నారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే ఎంతటి వారైనా విడిచి పెట్టేది లేదన్నారు. కూటమి పాలనలో మహిళకు పూర్తి రక్షణ కల్పిస్తున్నామన్నారు.

## ఏప్రిల్ చివరి వరకు సాగునీరు విడుదల చేయాలి: ఏపి రైతు సంఘం

**పల్నాడు, పతాకం న్యూస్:** పల్నాడు జిల్లాలో రబీ పంటలను కాపాడేందుకు ఏప్రిల్ నెలాఖరు వరకు సాగునీరు నిరంతరాయంగా విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం నరసరావుపేట లోని సూపరింటెండెంట్ ఇంజనీరు కార్యాలయంలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజనీర్ కొడాలి ఏడుకొండలకు వినతిపత్రం అందజేశారు. గోపాలరావు మాట్లాడుతూ.. జిల్లాలో లక్షలాది ఎకరాల్లో వరి, మొక్కజొన్న తదితర పంటలను ప్రధానంగా చిన్న, సన్నకారు రైతులు అప్పులు చేసి సాగు చేశారని తెలిపారు. పంట చేతికి వచ్చే కీలక దశలో సాగునీరు అందించకపోతే దిగుబడులు గణనీయంగా తగ్గిపోవడం, రైతులు అప్పులపాలవడం ఖాయమని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే పెట్టుబడులు పెరిగి ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతుల పరిస్థితి "మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా" మారుతుందని విమర్శించారు. వ్యవసాయం నష్టాల బాటలో ఉన్న వేళ, సాగునీటి విధానంలో పాలకుల అవగాహన రాహిత్యం రైతులను మరింత కష్టాల్లోకి నెట్టేస్తోందన్నారు. ప్రభుత్వం ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్ పేరుతో గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ సాగు నీరు ఇవ్వడంలో విఫలమవుతుందని ఆరోపించారు.కాలువల ఆధునీకరణ లోపం, సిబ్బంది కొరత కారణంగా సాగునీరు వృథా అవుతుందన్నారు. సరైన నిర్వహణతో చివరి భూములకు నీరు అందించవచ్చన్నారు.

## ప్రతీ ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు



**కోనసీమ, పతాకం న్యూస్:** నియోజకవర్గంలోని ప్రతీ ఇంటికి తాగునీటిని అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ అన్నారు. మామిడికుదురులో రూ.98.93లక్షలతో నిర్మించిన రక్షిత మంచినీటి ట్యాంకును సర్పంచ్ గౌస్ మోహిద్దీన్, టిడిపి ఇన్‌ఛార్జ్ గొల్లపల్లి అమూల్యలతో కలిసి ఎంఎల్ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ చొరవతో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు నిధుల వెల్లువలా వస్తున్నాయని అన్నారు. ప్రజల ఆరోగ్యానికి అత్యంత ముఖ్యమైన తాగునీటిని సరఫరా చేసేందుకు రాజీ లేకుండా నిధులు కేటాయిస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పనులన్నింటినీ యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## అస్వస్థతకు గురైన ఎంపీడీవో

**నరసాపురం, పతాకం న్యూస్:** నరసాపురం మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం. నాసరు రెడ్డి గురువారం విధుల్లో ఉండగా అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యారు. మాధవాయిపాలెం ఫెర్రీ వేలం పాట నిర్వహించేందుకు ఆయన కార్యాలయంలోని



సమావేశ మందిరానికి మెట్లు ఎక్కి వెళ్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. దీనిని గమనించిన కార్యాలయ సిబ్బంది వెంటనే స్పందించి ఆయనను చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యులు ఆయనకు అత్యవసర చికిత్స అందిస్తున్నారు. నాసరు రెడ్డి అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న పలువురు అధికారులు ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## తిరుమల ఘాట్ రోడ్డులో 'న్యూటన్' బస్సును పరీక్షిస్తున్న అధికారులు




**తిరుమల, పతాకం న్యూస్:** పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమలను కాలుష్య రహిత ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఏపీ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యం మేరకు తిరుమల-తిరుపతి మధ్య డీజిల్ బస్సుల స్థానంలో పూర్తి స్థాయిలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టే ప్రక్రియ వేగవంతమైంది. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా విడతల వారీగా జిల్లాకు 350 ఈవీ బస్సులను ఇచ్చేందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా, తొలి విడతలో 50 బస్సులను మంగళం డిపోకు కేటాయించారు. ప్రస్తుతం తిరుమల ఘాట్ రోడ్లపై వివిధ ఆటోమొబైల్ సంస్థల ఈవీ బస్సుల టెస్ట్ రైడ్స్ జరుగుతున్నాయి. తాజాగా 'న్యూటన్' సంస్థకు చెందిన బస్సు పనితీరును ఆర్టీసీ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. తిరుపతి-కాణిపాకం మధ్య పరీక్షలు ముగించుకున్న ఈ బస్సు, గత రెండు రోజులుగా తిరుమల ఘాట్ రోడ్లలోని మలుపుల్లో లోడ్, స్పీడ్ మరియు రేంజ్ పరంగా మెరుగైన ఫలితాలను ఇస్తోంది. ఫ్రంట్, మిడిల్ డోర్ సదుపాయం ఉన్న ఈ బస్సుపై అధికారులు ఇచ్చే నివేదిక ఆధారంగా తుది నిర్ణయం తీసుకోనున్నారు. త్వరలోనే శ్రీవారి భక్తులకు కాలుష్య రహిత, ఆహ్లాదకరమైన ప్రయాణం అందుబాటులోకి రానుంది.

## కూలీల ఆటో బోల్తా.. మహిళా మృతి

**ఉరవకొండ, పతాకం న్యూస్:** ఉరవకొండ మండలం నింబగల్లు సమీపంలో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో హసీనా (45)అనే మహిళా మృతి చెందారు. మిరప కోతలకు 13మంది కూలీలతో వెళ్తున్న ఆటో, ఇసుక ట్రాక్టర్ ని తప్పించబోయి అదుపు తప్పి



బోల్తా పడింది. ఈ ఘటనలో మరో పదిమందికి గాయాలయ్యాయి. బాధితులను చికిత్స నిమ్మితం ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# గుండె ఆరోగ్యంగా ఉండాలంటే ఏయే పరీక్షలను తరచూ చేయించుకోవాలి..?

గుండె ఆరోగ్యంగా ఉండాలంటే ఏయే పరీక్షలను తరచూ చేయించుకోవాలి..? గుండె ఆరోగ్యం కాపాడుకోవడం మొత్తం శరీర ఆరోగ్యానికి, దీర్ఘాయుష్షుకు అత్యంత కీలకం. గుండె శరీరమంతా రక్తాన్ని పంపుతూ అవయువాలకు ఆక్సిజన్, పోషకాలను అందిస్తుంది. గుండె సక్రమంగా పనిచేస్తే శక్తి స్థాయిలు, మానసిక స్పష్టత, భావోద్వేగ స్థిరత్వం కూడా మెరుగ్గా ఉంటాయి. అయితే ప్రపంచవ్యాప్తంగా గుండె సంబంధిత వ్యాధులు ప్రధాన ఆరోగ్య సమస్యగా మారాయి. గుండె శరీరమంతా రక్తాన్ని పంపుతూ అవయువాలకు ఆక్సిజన్, పోషకాలను అందిస్తుంది. గుండె సక్రమంగా పనిచేస్తే శక్తి స్థాయిలు, మానసిక స్పష్టత, భావోద్వేగ స్థిరత్వం కూడా మెరుగ్గా ఉంటాయి. అయితే ప్రపంచవ్యాప్తంగా గుండె సంబంధిత వ్యాధులు ప్రధాన ఆరోగ్య సమస్యగా మారాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔణూ) ప్రకారం కార్డియోవాస్క్యులర్ వ్యాధులే మరణాలకు ప్రధాన కారణం. అయితే జీవనశైలి, పర్యావరణ కారణాలను నియంత్రించడం ద్వారా వీటిని చాలా వరకు నివారించవచ్చని వైద్యులు చెబుతున్నారు. గుండె ఆరోగ్యాన్ని ముందుగానే అంచనా వేసేందుకు రెగ్యులర్ స్క్రీనింగ్స్ కీలక పాత్ర పోషిస్తాయి. ఈ పరీక్షల ద్వారా ప్రమాద సూచకాలను తొందరగా గుర్తించి, తీవ్రమైన నష్టం కలగకముందే చర్యలు తీసుకోవచ్చు. సమయానికి జాగ్రత్తలు తీసుకుంటే హార్ట్ అటాక్, స్ట్రోక్ వంటి సమస్యలను నివారించడం సాధ్యమవుతుంది.

ముఖ్యమైన సూచికలను నిరంతరం పరిశీలించడం ద్వారా వ్యక్తిగత ఆరోగ్యానికి



అనుగుణంగా చర్యలు తీసుకోవచ్చు. గుండె సంబంధిత వ్యాధులు చాలా వరకు ప్రారంభ దశలో ఎలాంటి లక్షణాలు లేకుండానే అభివృద్ధి చెందుతాయి. అందుకే నిపుణులు 20 ఏళ్ల వయస్సు నుంచే ప్రాథమిక పరీక్షలు ప్రారంభించాలని సూచిస్తున్నారు. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి చేయించుకోవాల్సిన పరీక్షల గురించి వైద్యులు ఏం చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి చేయించుకోవాల్సిన పరీక్షల్లో రక్తపోటు పరీక్ష ఒకటి. ఈ పరీక్ష రక్తం ధమనుల గోడలపై చూపే ఒత్తిడిని కొలుస్తుంది. అధిక రక్తపోటు రక్తనాళాలను దెబ్బతీసి గుండె వ్యాధులు, స్ట్రోక్ ప్రమాదాన్ని పెంచుతుంది. క్రమం తప్పకుండా చెక్ చేయడం ద్వారా సమస్యలను ముందుగానే గుర్తించవచ్చు. సాధారణంగా ప్రతి వైద్య పరీక్ష సమయంలో లేదా కనీసం సంవత్సరానికి ఒకసారి ఈ పరీక్ష చేయించుకోవాలి. విలువలు సాధారణంగా (120/80 ఎఎ నస్త్ర కంటే తక్కువ) ఉంటే సరిపోతుంది. అలాగే లిపిడ్ ప్రొఫైల్ (కొలెస్ట్రాల్) కూడా చేయించుకోవాలి. ఈ పరీక్షలో ాణూ (చెడు కొలెస్ట్రాల్), ఎణూ (మంచి కొలెస్ట్రాల్), ట్రైగ్లిసరైడ్స్ స్థాయిలను అంచనా వేస్తారు. ాణూ లేదా ట్రైగ్లిసరైడ్స్ పెరిగితే రక్తనాళాల్లో ప్లాక్ పేరుకుపోయి గుండె వ్యాధులకు దారి తీస్తుంది. సంవత్సరానికి ఒకసారి ఈ పరీక్ష చేయించుకోవడం ద్వారా కొలెస్ట్రాల్ ను నియంత్రణలో ఉంచుకోవచ్చు. అదే విధంగా నహెూ1ష (రక్తంలో 3 నెలల సగటు చక్కెర స్థాయిలు) పరీక్ష కూడా చేయించుకోవడం అవసరం. 2-3 నెలల సగటు బ్లడ్ షుగర్ స్థాయిని ఈ పరీక్ష తెలియజేస్తుంది. ఇన్సులిన్ రెసిస్టెన్స్ లేదా ప్రీడయాబెటిస్ ఉన్నదో లేదో గుర్తించడానికి ఇది ఉపయోగపడుతుంది. ఇవి గుండె వ్యాధులకు ముఖ్య ప్రమాద కారకాలు. సంవత్సరానికి ఒకసారి పరీక్ష చేయించడం ద్వారా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవచ్చు. ఇక ApoB లేదా Lp(a) పరీక్ష కూడా చేయించుకోవాల్సిందిగా వైద్యులు సూచిస్తున్నారు. ఈ పరీక్షలు రక్తంలో ఉన్న ప్రత్యేక లిపోప్రోటీన్లను కొలుస్తాయి. ApoB రక్తంలో హానికర కణాల సంఖ్యను తెలియజేస్తే, Lp(a) ప్లాక్ ఏర్పడే ప్రమాదాన్ని సూచిస్తుంది. 20 లేదా 30 ఏళ్ల వయస్సులోనే ఈ పరీక్షలు చేయించుకుంటే ముందుగానే జీవనశైలి మార్పులు చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. వీటితో పాటుగా బాడీ మాస్ ఇండెక్స్ (BMI), నడుము కొలతను కూడా పరీక్షించుకోవాలి. బరువు, కొవ్వు స్థాయిలు గుండె ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. BMI, నడుము కొలతలను క్రమం తప్పకుండా పరిశీలించడం ద్వారా ఒబేసిటీకి సంబంధించిన ప్రమాదాలను అంచనా వేయవచ్చు. ఈ విధంగా సంవత్సరానికి ఒకసారైనా ఈ పరీక్షలు చేయించుకోవడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. సాధారణంగా ఆరోగ్యంగా ఉన్నవారికి ఈ పరీక్షలు సంవత్సరానికి ఒకసారి చేయించుకోవడం సరిపోతుంది. అయితే ఇప్పటికే గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు లేదా ప్రత్యేక లక్షణాలు ఉన్నవారికి ఎకో, ECG, స్ట్రెస్ టెస్ట్, జుాజ స్కాన్ వంటి అదనపు పరీక్షలు అవసరమవ్వచ్చు. ఈ ముఖ్యమైన పరీక్షలను నిరంతరం చేయించుకోవడం ద్వారా గుండె ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకుని, తగిన నిర్ణయాలు తీసుకోవచ్చు. ముందస్తు జాగ్రత్తలతో గుండె వ్యాధులను నియంత్రించడం సాధ్యమవుతుందని వైద్యులు తెలియజేస్తున్నారు.

# ఒక్కొక్కటిగా మూతపడుతున్న కొబ్బరి పీచు పరిశ్రమ

## సగానికి పడిపడిపోయిన పీచు ధరలు.. పనిలేక వలసపోతున్న కార్మికులు



**కంచిలి, పతాకం న్యూస్:** ఒకప్పుడు కంచిలి కొబ్బరి పీచు పరిశ్రమకు రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు ఉండేది. 40 ఏళ్ల కిందట ఇక్కడ పదుల సంఖ్యలో పీచు పరిశ్రమలు నడిచేవి. వీటిలో వందలాది మంది కార్మికులు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధిని పొందేవారు. ఇప్పుడు ఈ పరిస్థితి పూర్తిగా మారింది. ప్రస్తుతం కొబ్బరి పీచు పరిశ్రమ పూర్తిగా ప్రాభావాన్ని కోల్పోయింది. ఉద్దానం కొబ్బరికి చీడపీడల కారణంగా నాణ్యత లోపించడం కంచిలి కొబ్బరి మార్కెట్‌పై తీరని ప్రభావం చూపింది. మరోపక్క పీచు ధర సగానికి పడిపోయింది. దీంతో కొబ్బరి పీచు పరిశ్రమ దివాలాస్థితికి చేరింది. ఆ భవనాలు గోడౌన్‌లుగా మారాయి. ఇక్కడ పనిలేక కార్మికులు ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నారు. గతంలో కంచిలితో పాటు పరిసర గ్రామాల్లో సుమారు 14 కొబ్బరి పీచు పరిశ్రమలు ఉండేవి. ఈ పరిశ్రమల్లో ఆయా గ్రామాలకు చెందిన మహిళలు, యువకులు పనిచేసుకుంటూ జీవనం సాగించేవారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా వందలాది మంది జీవనోపాధిపొందేవారు. కంచిలిలో తయారయ్యే పీచుకు మంచి గిరాకీ ఉండేది. నాణ్యమైన కొబ్బరి పీచును తయారు చేసి దేశంలోని గుజరాత్, కేరళ, తమిళనాడు, అహ్మదాబాద్ వంటి రాష్ట్రాలకు ఎగుమతి చేసేవారు. దీంతో కార్మికులతో ఈ ప్రాంతం నిత్యం కళకళలాడేది. అయితే, కాలక్రమంలో ఉద్దానంలో ప్రకృతి విలయాలకు కొబ్బరి పంట పూర్తిగా నాశనం కావడడం, చీడ పీడలు, తెగుళ్లతో కాయల నాణ్యత, దిగుబడి తగ్గడంతో ఆ ప్రభావం ప్రత్యక్షంగా కొబ్బరి మార్కెట్‌పై, పరోక్షంగా పీచు పరిశ్రమలపై పడింది. మొదట్లో వాటిని ఎలాగో యజమానులు నెట్టుకొచ్చారు. అయితే, రానురాను నష్టాలు ఎక్కువకావడంతో భరించలేక పరిశ్రమలను మూసివేశారు. ప్రస్తుతం కేవలం 4 మాత్రమే నడుస్తున్నాయి. టన్ను పీచు ధర రూ.18 వేల నుంచి రూ.10 వేలకు పడిపోయింది. దీంతో గోడౌన్‌లో సరుకు పేరుకుపోయింది. ప్రభుత్వాల నుంచి చేయూత లేక, పెరుగుతున్న నిర్వహణ వ్యయాన్ని భరించలేక, యంత్రాల మరమ్మతులకు గురికావడం, అప్పుల పాలవ్వడం వంటి కారణాలతో పరిశ్రమలను మూసివేసినట్లు పలువురు యజమానులు చెబుతున్నారు. గతంలో కొబ్బరి పీచు పరిశ్రమకు అవసరమైన ముడి సరుకు అమలాపురం వంటి ప్రాంతాల్లో ఉచితంగా, లేదా తక్కువ ధరకే లభిస్తుండేది. అయితే, ప్రస్తుతం ముడి సరుకును అధిక ధరకు కొనుగోలు చేయాల్సి రావడం కూడా పీచు పరిశ్రమ దివాలాకు కారణమైందని యజమానులు వాపోతున్నారు. కంచిలి మండలంలోని ఎస్ఆర్‌సీ పురం, అంపురం, బురదపాడు, పద్మతుల, గొల్లకంచిలి తదితర గ్రామాల్లో కొబ్బరి కార్మికులు ఉన్నారు. గతంలో స్థానికంగా నిర్వహిస్తున్న కొబ్బరి బడ్డీలు, కొబ్బరి పీచు పరిశ్రమల్లో పనులు చేసుకుంటూ వీరంతా జీవనం సాగించేవారు. ప్రస్తుతం కొబ్బరి పీచు పరిశ్రమలు మూతపడడంతో వాటి భవనాల్లో చాలా వరకు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్ని భవనాలు చెత్తను విక్రయించే షాపులుగా, మరికొన్ని గోడౌన్‌లుగా మారాయి. అలాగే, మార్కెట్ కూడా పూర్తిగా దెబ్బతింది. దీంతో స్థానికంగా పనులు లభించకపోవడంతో కార్మికులు వలస పోతున్నారు. గతంలో ఇక్కడ తయారు చేసిన పీచును ఏ రాష్ట్రాలకు ఎగుమతి చేసేవారో, ఇప్పుడు అదే రాష్ట్రాలకు వలస కూలీలుగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం వీరంతా ఎటువంటి భద్రతలేని పనుల్లో ఉంటూ కుటుంబ పోషణ కోసం కష్టపడుతున్నారు. వలసలు నివారిస్తామని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో స్థానికంగా కొబ్బరి మార్కెట్‌కు, కొబ్బరి పీచు పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కార్మికులు కోరుతున్నారు.

నిర్వహణ ఖర్చులు పెరగడం, ముడి సరుకుల స్థానికంగా లభించకపోవడంతో పీచు పరిశ్రమ నిర్వహించడం చాలా కష్టంగా ఉందని, పరిశ్రమ నిలదొక్కుకోవాలంటే ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలని, సబ్సిడీపై రుణాలు అందించడం, రాయితీపై యంత్రాలు మంజూరు చేయడం చేస్తే పరిశ్రమ అభివృద్ధి చెందుతుందని పీచు పరిశ్రమ నిర్వాహకులు తెలియజేస్తున్నారు.

# మెరికా విమాన వాహకనౌక లక్ష్యంగా క్షిపణి దాడులు చేశాం: ఇరాన్



**ఇరాన్:** ఇరాన్‌పై దాడులను ఐదు రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ప్రకటించిన రెండు రోజుల అనంతరం, అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. అగ్రరాజ్యం అమెరికాకు చెందిన విమాన వాహక నౌక యూఎస్ఎస్ అబ్రహం లింకన్ లక్ష్యంగా ఇరాన్ క్రూయిజ్ క్షిపణితో దాడులు చేసింది. ఈ మేరకు ఇరాన్ ప్రభుత్వం ప్రకటన చేసింది. యూఎస్ఎస్ అబ్రహం లింకన్ విమాన వాహక నౌక వైపు తాము క్రూయిజ్ క్షిపణిని ప్రయోగించామని ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ ప్రసారం చేసింది. దీనిని అమెరికా ధృవీకరించవలసి ఉంది. ఈ విమాన వాహక నౌక కదలికలను నిరంతరం పరిశీలిస్తున్నామని, దానిని లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ హెచ్చరించింది. ఆ తర్వాత గంటలోపు క్షిపణి దాడి జరగడం గమనార్హం. ఇందుకు సంబంధించిన వీడియోను ఇరాన్ మీడియా విడుదల చేసింది. అబ్రహం లింకన్‌పై దాడి చేశామని ఇరాన్ ఇదివరకు కూడా ప్రకటించింది. తమ బాలిస్టిక్ క్షిపణులు ఈ నౌకను ఢీకొట్టాయని, దీనితో అది పని చేయడం లేదని, గల్ఫ్ జలాల నుంచి వెనక్కి తగ్గిందని ఇటీవల ఇరాన్ ప్రకటించగా, అమెరికా తోసిపుచ్చింది. అమెరికాతో తమకు ఎలాంటి చర్చలు జరగడం లేదని, అయితే గత కొన్ని రోజులుగా మధ్యవర్తుల ద్వారా ఇరు దేశాల మధ్య సందేశాలు మాత్రం మార్పిడి అవుతున్నాయని ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చీ వెల్లడించారు. ఇవి చర్చలు లేదా సంప్రదింపుల కిందకు రావని ఆయన స్పష్టం చేశారు. బుధవారం స్థానిక మీడియాకు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. "గత కొన్ని రోజుల నుంచి అమెరికా వైపు నుంచి వివిధ మధ్యవర్తుల ద్వారా మాకు సందేశాలు వస్తున్నాయి. స్నేహపూర్వక దేశాల ద్వారా వచ్చే ఆ సందేశాలకు మేము మా వైఖరిని స్పష్టం చేస్తూ, అవసరమైన హెచ్చరికలు జారీ చేస్తున్నాం. దీనిని చర్చలు అనరు. కేవలం సందేశాల మార్పిడి మాత్రమే జరిగింది" అని అరాఘ్చీ వివరించారు. తమ దేశంలోని మౌలిక సదుపాయాలపై దాడి చేయవద్దని తాము పంపిన ఒక సందేశంలో అమెరికాను తీవ్రంగా హెచ్చరించామని, దాని ఫలితంగా 48 గంటల్లో ఇరాన్ విద్యుత్ ప్లాంట్లపై దాడి చేస్తామన్న తన హెచ్చరికను వాషింగ్టన్ వెనక్కి తీసుకుందని ఆయన పేర్కొన్నారు.




# సొంతగడ్డపై టీమిండియా 2026-27 షెడ్యూల్



భారత క్రికెట్ అభిమానులకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) శుభవార్త అందించింది. 2026-27 సీజన్‌కు సంబంధించి టీమిండియా స్వదేశంలో ఆడనున్న అంతర్జాతీయ మ్యాచ్‌ల పూర్తి షెడ్యూల్‌ను గురువారం ప్రకటించింది. ఈ సీజన్‌లో వెస్టిండీస్, శ్రీలంక, జింబాబ్వే, ఆస్ట్రేలియా జట్లు భారత్‌లో పర్యటించనున్నాయి. దేశవ్యాప్తంగా మొత్తం 17 నగరాల్లో 22 అంతర్జాతీయ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ షెడ్యూల్‌లో కొన్ని ప్రత్యేకతలు కూడా ఉన్నాయి. అక్టోబర్ 2024 తర్వాత తొలిసారిగా బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం అంతర్జాతీయ మ్యాచ్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది. అలాగే, ప్రతిష్టాత్మక బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా గౌహతిలోని బర్సపరా స్టేడియం మొదటిసారి ఒక టెస్ట్ మ్యాచ్ నిర్వహించనుంది. షెడ్యూల్ వివరాల్లోకి వెళ్తే, ఈ హోమ్ సీజన్ వెస్టిండీస్ పర్యటనతో ప్రారంభమవుతుంది. సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 17 వరకు జరిగే ఈ టూర్‌లో మూడు వన్డేలు, ఐదు టీ20లు ఉంటాయి. వన్డేలకు త్రివేండ్రం, గౌహతి, న్యూ చండీగఢ్ ఆతిథ్యం ఇస్తుండగా.. లక్నో, రాంచీ, ఇండోర్, హైదరాబాద్, బెంగళూరు నగరాలు టీ20 మ్యాచ్‌లకు వేదికలుగా నిలవనున్నాయి. ఆ తర్వాత, డిసెంబర్‌లో శ్రీలంక జట్టు భారత్‌లో పర్యటిస్తుంది. డిసెంబర్ 13 నుంచి 27 వరకు జరిగే ఈ సిరీస్‌లో మూడు వన్డేలు, మూడు టీ20లు ఉంటాయి. వన్డేలు ఢిల్లీ, బెంగళూరు, అహ్మదాబాద్‌లలో జరగనుండగా.. రాజ్‌కోట్, కటక్, పుణేలలో టీ20 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. కొత్త ఏడాది ఆరంభంలో, జనవరి 3 నుంచి 9 వరకు జింబాబ్వే జట్టు భారత్‌లో పర్యటించి మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. ఈ మ్యాచ్‌లకు కోల్‌కతా, హైదరాబాద్, ముంబై నగరాలు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. దీంతో హైదరాబాద్ నగరానికి ఈ సీజన్‌లో రెండు అంతర్జాతీయ మ్యాచ్‌లు దక్కినట్లయింది. ఈ సీజన్‌కు ప్రధాన ఆకర్షణగా, అభిమానులు ఎంతగానో ఎదురుచూసే బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ నిలవనుంది. జనవరి 21 నుంచి మార్చి 3 వరకు ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల సిరీస్ జరగనుంది. నాగ్‌పూర్‌లో తొలి టెస్టు ప్రారంభం కానుండగా, ఆ తర్వాత చెన్నై, గౌహతి, రాంచీ, అహ్మదాబాద్‌లలో మిగిలిన మ్యాచ్‌లు జరుగుతాయి. ప్రపంచంలోని రెండు అగ్రశ్రేణి జట్ల మధ్య జరిగే ఈ సిరీస్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి.

# ఐపీఎల్‌పై ముంబై ఇండియన్స్‌ది చెరగని ముద్ర..



ఐపీఎల్‌పై ముంబై ఇండియన్స్‌ది చెరగని ముద్ర. ఐదుసార్లు చాంపియన్‌గా నిలవడం లీగ్‌లో ఆ జట్టు ఆధిపత్యానికి నిదర్శనం. కానీ గత ఐదు సీజన్లుగా ముంబై ప్రదర్శన అత్యంత పేలవంగా ఉంది. 2022, 2024లో అయితే 10వ స్థానంతో తీవ్రంగా నిరాశపరిచింది. 2023లో కాసింత మెరుగ్గా మూడో స్థానం దక్కించుకుంది. 2021ని ఐదో స్థానంతో ముగించింది. గతసారి క్వాలిఫయర్-2లో పంజాబ్ కింగ్స్ చేతిలో ఓటమితో మూడో స్థానంతో వెనుదిరిగింది. సుదీర్ఘకాలం ముంబై కెప్టెన్‌గా వ్యవహరించి లీగ్‌లో జట్టును అత్యున్నత స్థాయికి చేర్చిన రోహిత్ శర్మను పక్కనబెట్టి హార్దిక్ పాండ్యాకు సారథ్య బాధ్యతలు అప్పగించడం ఓ సంచలనం. రోహిత్‌ను సారథిగా తప్పించడాన్ని ముంబై ఇండియన్స్ ఫ్యాన్స్ చాలాకాలంపాటు జీర్ణించుకోలేకపోయారు. ఈ క్రమంలో హార్దిక్ పాండ్యాకు అవమానాలూ ఎదురయ్యాయి. మొత్తంగా సంధి దశనుంచి బయటపడిన ముంబై ఇండియన్స్ ఈసారి లీగ్‌లో బలమైన జట్లలో ఒకటి. మరిక ముంబై ఇండియన్స్ జట్టు టైటిళ్ల 'సిక్సర్' కొడుతుందేమో చూడాలి. కోర్ క్రికెటర్లను అట్టిపెట్టుకున్న ముంబై ఇండియన్స్ గత మినీ వేలంలో వ్యూహాత్మకంగా వ్యవహరించింది. ట్రెంట్ బౌల్ట్, దీపక్ చాహర్, స్పిన్ ఆల్‌రౌండర్ విల్‌జాక్స్‌ను కొనుగోలు చేసి బౌలింగ్ విభాగాన్ని పటిష్ట పరుచుకుంది. పవర్ హిట్టర్ షెర్ఫానే రూథర్‌ఫోర్డ్‌ను గుజరాత్ టైటాన్స్ నుంచి, మరో ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్‌ను లఖ్‌నవూనుంచి ట్రేడింగ్ చేసుకుంది. 2019-21 సీజన్లలో పరుగులు వరద పారించిన క్వింటన్ డికాక్‌ను మళ్లీ తెచ్చుకుంది. ఈ దక్షిణాఫ్రికా స్టార్ రాకతో ముంబై బ్యాటింగ్ మరింత బలపడింది. రోహిత్ శర్మ, డికాక్ తుఫాన్ ఇన్నింగ్స్‌కు సూర్యకుమార్ యాదవ్, తిలక్‌వర్మ, విల్‌జాక్స్, హార్దిక్ పాండ్యా, నమన్ ధిర్‌ల దూకుడైన బ్యాటింగ్ తోడైతే ముంబైకి తిరుగుండదు. ఇక లోయరార్డర్‌లో మిచెల్ శాంట్నర్ బ్యాటింగ్ సత్తా అందరికీ తెలిసిందే. బుమ్రా, ట్రెంట్ బౌల్ట్, దీపక్ చాహర్‌తో కూడిన పేస్ బౌలింగ్ విభాగాన్ని ఎదుర్కోవడం ప్రత్యర్థులకు సవాలే. తన నాయకత్వంలో న్యూజిలాండ్‌ను టీ20 వరల్డ్ కప్ ఫైనల్‌కు చేర్చిన శాంట్నర్ స్పిన్ బౌలింగ్‌తో జట్టుకు సమతూకం తెస్తాడు. వరల్డ్ క్లాస్ స్పిన్నర్ శాంట్నర్‌తో స్పిన్ బాధ్యతలు పంచుకొనే అనుభవజ్ఞుడైన భారత బౌలర్ లేకపోవడం ముంబై జట్టులో ప్రధాన లోటు. చెన్నై, లఖ్‌నవూ వంటి టర్నింగ్ పిచ్‌లపై మయాంక్ మార్కండే, కొత్తగా తీసుకొన్న అథర్వ అంకోలేకర్ ఎలా రాణిస్తారనేది ప్రశ్నార్థకం.

**బ్యాటర్లు:** రోహిత్ శర్మ, డికాక్, తిలక్ వర్మ, సూర్యకుమార్, షెర్ఫానే రూథర్‌ఫోర్డ్, డానిష్ మలేవార్.

**ఆల్‌రౌండర్లు:** హార్దిక్ పాండ్యా, విల్ జాక్స్, శాంట్నర్, రాజ్ బజ్వా, కార్బిన్ బాష్, శార్దూల్, మయాంక్ రావత్, అథర్వ అంకోలేకర్, రాబిన్ మిన్జ్, రికెల్టన్, నామన్ ధిర్.

**బౌలర్లు:** బుమ్రా, దీపక్ చాహర్, అశ్వనీ కుమార్, బౌల్ట్, మహ్మద్ ఇజార్, అల్లా ఘుజన్ఫర్, రఘు శర్మ, మార్కండే.

అత్యంత పటిష్టంగా కనిపిస్తున్న ముంబై టైటిల్ రేసులో ఉన్న ప్రధాన జట్లలో ఒకటిగా పరిగణిస్తున్నారు.




# అంచనాలను రెట్టింపు చేసిన 'రాకాస' ట్రైలర్



నిహారిక.. జీ స్టూడియోస్ సమర్పణలో తన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ఉమేష్ కుమార్ బన్సాల్‌తో కలిసి నిర్మించిన చిత్రం 'రాకాస'. మానస శర్మ తెరకెక్కించిన ఈ చిత్రంలో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించారు. ఈ సినిమా ఏప్రిల్ 3న రిలీజ్ అవుతోంది. ఇప్పటి వరకు విడుదల చేసిన టీజర్, సాంగ్స్‌తో సినిమాపై ఆసక్తి పెరిగింది. డిఫరెంట్ ప్రమోషనల్ కంటెంట్‌తో మూవీపై బజ్ క్రియేట్ అయ్యింది. ఈ క్రమంలో మేకర్స్ బుధవారం రోజున ట్రైలర్‌ను విడుదల చేశారు. లేటెస్ట్‌గా విడుదలైన ఈ ట్రైలర్ సినిమాపై ఎక్స్‌పెక్టేషన్స్‌ను మరింతగా పెంచాయి.

'ఆ కోటలో ఉన్నది.. ఊరు బలి పంపుతున్నది సామాన్యుడికి కాదు.. భీకర బ్రహ్మ రాక్షసుడికి' అనే డైలాగ్‌తో 'రాకాస' ట్రైలర్ ప్రారంభమవుతుంది. దానికి అనుగుణంగా చూపించే పురాతనమైన కోట.. బ్రహ్మ రాక్షసుడు ఇవన్నీ సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేస్తున్నాయి. భయంతో నడుస్తున్న గెటప్ శీను ఓ పిల్లాడు చేసిన బూర సౌండ్‌కి జడుసుకుంటాడు. వెంటనే 'నువ్వు పెద్ద డిఎస్‌పి అనుకుంటున్నావా? లోపలకిపో..కోతి నాయాలా!' అని తిడతాడు.

హీరో సంగీత్ శోభన్, నయన సారికల మధ్య ఉన్న ప్రేమ.. హీరో, హీరోయిన్‌కు మధ్య ఉన్న సీన్స్‌ను చూపిస్తూ వారి మధ్య ఉన్న లవ్ యాంగిల్‌ను రివీల్ చేశారు. బస్సులో సంగీత్, తనికెళ్ల భరణి, గెటప్ శీను మధ్య వచ్చే కామెడీ సీన్ ఆకట్టుకుంటోంది. పోలీస్ ఆఫీసర్ సంగీత్‌ను ఉద్దేశించి 'రాత్రి ఏం జరిగింది?' అని అడిగితే..'పడుకోవడం లేటయ్యింది' అని కామెడీగా సమాధానమిస్తాడు. 'వేళాకోళంగా ఉందా? నా హిస్టరీ నీకు తెలియదు' అని బ్రహ్మాజీ సంగీత్‌తో అంటే.. 'ఏం డిలీట్ చేస్తారా?' అని ఇచ్చే ఫన్నీ కౌంటర్ ఆకట్టుకుంటోంది. 'ఊరుకొచ్చినప్పటి నుంచి నా జీవితం ఎటేలుతుందో తెలియటం లేదు' అని హీరో టెన్షన్ పడటం.. దానికి తోడు ట్రైలర్లో చూపించే ఉల్క పతనం..రాత్రికి రాత్రి పశువులు కలేబరాలుగా మారటం చూస్తే ఊర్లో ఏదో జరుగుతుందనే క్యూరియాసిటీ క్రియేట్ అవుతుంది. ఊరు బతికి బయటపడాలంటే బలి పంపాల్సిందే అంటూ తనికెళ్లభరణి చెప్పటం..కోటకు సంబంధించిన తాళాన్ని చూపించటం చూస్తే కోటకు, ఊరుకి మధ్య ఏదో లింకు ఉందనేది అర్థమవుతుంది. ట్రైలర్ చివరలో 'ఈమాత్రం దానికేనా.. లోపల నీకుంటది అసలైన మ్యూజిక్ అనటంతో..' బ్రహ్మ రాక్షసుడు ఉండే కోటలోకి హీరో సంగీత్ ఎంట్రీ ఉంటుంది.. ఆ కోటలోకి వెళ్లిన హీరో ఏం చేశాడు? ఊరిని కాపాడాడా? తన ప్రేమను గెలిపించుకున్నాడా? అనే విషయాలు తెలియాలంటే మాత్రం ఏప్రిల్ 3న రిలీజ్ కానున్న రాకాస సినిమా చూడాల్సిందేనని ఆసక్తి రెట్టింపు అయ్యింది. రాజు ఎదురోలు సినిమాటోగ్రఫీ, అనుదీప్ దేవ్ మ్యూజిక్ సినిమాకు పెద్ద ఎసెట్‌గా మారింది.

నటీనటులు : సంగీత్ శోభన్, నయన్ సారిక, వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ, గెటప్ శ్రీను తదితరులు. బ్యానర్: పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్, జీ స్టూడియోస్ నిర్మాతలు: నిహారిక కొణిదెల, ఉమేష్ కుమార్ బన్సాల్ రచన, దర్శకత్వం : మానస శర్మ సినిమాటోగ్రఫీ : రాజు ఎదురురోలు సంగీతం : అనుదీప్ దేవ్ ఎడిటర్ : అన్వర్ అలీ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : రమేష్ మన్యం కొరియోగ్రఫీ : జెడి, భాను ఆర్ట్ డైరెక్టర్ : విష్ణు వర్ధన్ పుల్లా కాస్ట్యూమ్ డిజైనర్ : సంధ్య సబ్బవరపు పి.ఆర్.ఒ : నాయుడు సురేంద్ర కుమార్ -- ఫణి కందుకూరి (బియాండ్ మీడియా)

# నేడు 'యూత్' సినిమా విడుదల



కెన్ కరునాస్, అనిష్మ అనిల్‌కుమార్, దేవదర్శిని చేతన్, సూరజ్ వెంజరముడు, ప్రియాన్షి యాదవ్, మీనాక్షి దినేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తమిళ మూవీ 'యూత్'. ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కావాల్సివుంది. అనివార్య కారణాలతో ఒక రోజు ఆలస్యంగా 27న థియేటర్లలోకి రాబోతోంది. పెయిడ్ ప్రీమియర్స్‌పై ప్రకటన చేస్తామని ప్రొడ్యూసర్స్ వెల్లడించారు. ఇప్పటికే తమిళంలో ఘన విజయం సాధించిన ఈ చిత్రాన్ని ఈ2సీ బ్యానర్‌పై హౌస్‌ఫుల్ వినీత్, సందీప్ తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ చిత్రానికి కెన్ కరునాస్ అండ్ గ్యాంగ్ దర్శకత్వం వహించారు. 'కమ్ విత్ యువర్ గ్యాంగ్, నోట్-నో ఏజ్ లిమిట్' అనే స్లోగన్‌తో ఈ సినిమా ప్రమోషనల్ క్యాంపెయిన్ చేస్తున్నారు.






# మారుతి దర్శకత్వంలో హ్యాపీ పొంగల్?



సంక్రాంతికి 'ది రాజాసాబ్'తో ప్రేక్షకుల్ని పలకరించిన దర్శకుడు మారుతికి, ఆ సినిమా ఫలితం చేదు అనుభవాన్ని మిగిల్చింది. మరి నెక్ట్స్ ఆయన ఎవరితో సినిమా చేస్తారు? అనే విషయంపై కొన్ని రోజులుగా ఫిల్మ్‌వర్గాల్లో చర్చోపచర్చలు జరుగుతూ ఉన్నాయి. తాజా సమాచారం ప్రకారం మారుతి ఓ కథను సిద్ధం చేసుకున్నారు. మైత్రీ మూవీమేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తారు. వరుణ్‌తేజ్, సాయిదుర్గతేజ్, రామ్ ఈ ముగ్గురిలో ఎవరో ఒకరు హీరో అయ్యే అవకాశం ఉందని ఫిల్మ్ వర్గాల్లో టాక్ వినిపించింది. అయితే.. ఈ కథను చివరకు వైష్ణవ్‌తేజ్ ఓకే చేసినట్టు సమాచారం.ప్రస్తుతం కథల విషయంలో వైష్ణవ్ ఆచితూచి అడుగులేస్తున్నారు. ఇప్పటివరకూ ఎన్ని కథలు విన్నా ఆయన ధైర్యంగా 'ఎస్' చెప్పలేదు. కానీ మారుతీతో కలిసి నడవడానికి ఆయన సిద్ధమైనట్టు తెలిసింది. ఈ సినిమా షూటింగ్ త్వరలోనే మొదలు కానున్నదని సమాచారం. వచ్చే ఏడాది సంక్రాంతికి సినిమాను విడుదల చేయాలని మారుతి భావిస్తున్నారు. 'హ్యాపీ పొంగల్' అనే టైటిల్‌ని కూడా రిజిస్టర్ చేశారు. ఈ సినిమాకు సంబంధించిన ఇతర వివరాలు త్వరలో వెల్లడికానున్నాయి.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**